Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03




నెల్లూరు, 13.04.2018, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 45 పేజీలు : 12, వెల : ₹ 5

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



# ఆపరేషన్ ఆంధ్రా!


- కర్ణాటక ఎన్నికల తర్వాత ఏపిలో పెనుమార్పులు
- బాబుకు విచారణ భయం పట్టుకుంది
- ఏపికి ప్రత్యేకహోదా ప్రకటించే అవకాశం

ఈమధ్య సినిమా యాక్టర్ శివాజీ ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ ద్రవిడ, ఆపరేషన్ పెరుగువడ అంటూ అయ్యవారు లాగా బ్లాక్‌బోర్డు మీద వ్రాసిమరీ విలేకరులకు వివరించాడు. శక్తివంతమైన ఇంటలిజన్స్ విభాగానికి సైతం అందని సమాచారం తనకు అందినట్లు ఆయన ఫోజిచ్చాడు. అయితే ఆపరేషన్ గరుడ, పెరుగువడ సంగతేమోగాని, త్వరలోనే కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో తన మిషన్‌ను ఆపరేషన్‌ను అమలు చేయడం మాత్రం గ్యారంటీగా కనిపిస్తోంది. బహుశా కర్నాటక ఎన్నికలు ముగిసాక బీజేపీ పెద్దలు ఏ.పి రాజకీయాలపై దృష్టిపెట్టే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

కమలదళం ఆపరేషన్ మొదలుపెట్టడమంటే మొదట ఈ నాలుగేళ్ళ పాలనలో చంద్రబాబు అక్రమాల చిట్టాను బయటకు తీయడమే! ఒకటా రెండా... ఈ నాలుగేళ్ళ పాలనలో ఎన్నో లొసుగులున్నాయి. ఎన్నో వేలకోట్ల దుర్వినియోగం వుంది. దుబారా వుంది. లెక్కలేనంత అవినీతి వుంది. ఈ దేశంలో 29రాష్ట్రాలుంటే సగానికిపైగా రాష్ట్రాలలో కుంభమేళా, పుష్కరాలు జరుగుతుంటాయి. కాని, ఏ రాష్ట్రంలో కూడా వేలకోట్లు పెట్టి పుష్కరాలను చేయలేదు. కేవలం దోపిడీ పథకంలో భాగంగానే ఏపిలో గోదావరి, కృష్ణ పుష్కరాలను నిర్వహించినట్లుగా వుంది. పుష్కరాలప్పుడు చేసిన పనులు, వాటి అంచనాలు, లెక్కలు బయటకు తీస్తే ఆశ్చర్యపరిచే బొక్కలు బయటపడతాయి. పట్టిసీమ ప్రాజెక్ట్ పేరుతో ఎంత

(మిగతా 11వ పేజీలో)

## చీకట్లను చీల్చుకుంటూ...



## దూసుకెళ్తా..

పిఎస్ఎల్వి-సి41 సక్సెస్

3లో

## ఆ ఒక్కడే... వణికిస్తున్నాడు!

45ఏళ్ళ యువకుడి రాజకీయానికి 40ఏళ్ళ అనుభవం విలవిలలాడుతోంది



*నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం... ముఖ్యమంత్రిగా 13ఏళ్ళ సర్వీసు... రెండుసార్లు మంత్రి... ఏడుసార్లు ఎమ్మెల్యే... జాతీయ రాజకీయాలలో గిర్రున చక్రం తిప్పిన నేర్పరితనం... యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్... ఇన్ని వున్న చంద్రబాబునాయుడును నిండా 45ఏళ్ల వయసుండని వై.యస్. జగన్మోహన్‌రెడ్డి ముప్పతిప్పలు పెడుతున్నాడు.*

వై.యస్.జగన్మోహన్‌రెడ్డి చంద్రబాబు చేత రోజుకో మాట మాట్లాడిస్తున్నాడు. వారానికో వేషం వేసేలా చేయిస్తున్నాడు. ఇన్నేళ్ళ తన రాజకీయ జీవితంలో చంద్రబాబు మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, వై.యస్.రాజశేఖరరెడ్డి, కె.రోశయ్య, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి వంటి ప్రతిపక్ష ప్రత్యర్థులను చూసాడు. కాని, జగన్ లాంటి ప్రతిపక్ష నేత చంద్రబాబు 40ఏళ్ల రాజకీయ చరిత్రలో ఇంతవరకు ఎదురుకాలేదు. చంద్రబాబును అసమర్ధ నేతగా అవినీతిపరుడిగా, రోజుకో మాట మార్చే రాజకీయ ఊసరవెల్లిగా, మాట మీద నిలబడని వ్యక్తిగా, పచ్చి అవకాశవాదిగా ప్రజల ముందు నిరూపించడంలో జగన్ చాలావరకు సక్సెస్ అయ్యాడు.

(మిగతా 11వ పేజీలో)

## 'రత్నం'... మళ్ళీ రత్నమే!

ఇంటర్ బైపిసి స్టేట్ టాపర్‌గా రత్నం విద్యార్థిని ఎన్.లక్ష్మీకీర్తి



11లో



# 'విశ్వసాయి' విజయపరంపర

## • సీనియర్ ఇంటర్ ఫలితాల్లో జయకేతనం



సీనియర్ ఇంటర్ ఫలితాల్లో బైపిసి, ఎంపిసి విభాగాల్లో నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఉన్న విశ్వసాయి జూనియర్ కళాశాల విజయకేతనం ఎగురవేసింది. సీనియర్ ఇంటర్‌లో 38 మంది విద్యార్థులు 980కి పైగా మార్కులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారని ఆ సంస్థ ఛైర్మెన్ డా. ఎన్.సత్యనారాయణ తెలిపారు. బైపిసి విభాగంలో తుమ్మల భార్గవి, యస్.లిఖిత వెయ్యి మార్కులకుగాను 988మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచారని, జి.వెంకటస్నేహాంజలి 987 మార్కులు, సిహెచ్ చరిత, పి.మనీషా 986 మార్కుల వంతున సాధించి ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారని ఆయన పేర్కొన్నారు అదేవిధంగా ఎంపిసి విభాగంలో చెముకుల శ్రీలేఖ వెయ్యి మార్కులకుగాను 986 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచిందని, ఎం.వసుంధర 985మార్కులతోను, ఎం.అక్షయ్‌రెడ్డి 983మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక బివినగర్‌లోని విశ్వసాయి కాలేజీలో విద్యార్థులకు అభినందనల సభ ఏర్పాటుచేసి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ విజయంలో అధ్యాపకుల పాత్ర కీలకమని, వీరితో పాటు తల్లిదండ్రుల కృషి కూడా ఉందని అంటూ అందరికీ ఈ సందర్భంగా ఆయన తన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వసాయి ఛైర్మెన్ డా.సత్యనారాయణతో పాటు, డైరెక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# విపిఆర్ ఉచిత వైద్య శిబిరం

## • దివ్యాంగులకు ఉచితంగా జైపూర్ ఫుట్స్



ఈ నెల 19, 20 తేదీలలో నెల్లూరు, కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వికలాంగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. 19వ తేదీ రాజ్య సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా వికలాంగులకు ఆయన జన్మదిన కానుకగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. 19వ తేదీ ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగాను, నెల్లూరు గ్రామీణ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ విశిష్ఠ అతిథులుగాను విచ్చేయనున్నారు. వికలాంగులు, కాళ్ళు లేని వారిని నిపుణులచే పరీక్షించి వారికి ఉచితంగా జైపూర్ ఫుట్స్‌ను అమరుస్తారు. శ్రీ భగవాన్ మహావీర్ వికలాంగుల సహాయ సమితి హైదరాబాద్ వారి సహకారంతో విపిఆర్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. వికలాంగులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్‌ఫోటోలు తీసుకుని శిబిరానికి హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు. వివరాలకు 7680944389, 8885831414 నెంబర్లలో సంప్రదించవచ్చు.

# టౌన్‌హాల్ సంస్థాపక దినోత్సవం



సింహపురికే తలమానికంగా నిలిచిన రావుబహదూర్ రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం(టౌన్‌హాలు) 103వ సంస్థాపక దినోత్సవ వేడుకలు ఈ నెల 8న టౌన్‌హాలులో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టౌన్‌హాలు ట్రస్టు కార్యదర్శి జె.యస్.రెడ్డి మాట్లాడుతూ శతవసంతాల వైభవాన్ని మరింతగా ఇనుమడింపజేసేలా అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతాయని, అభివృద్ధిలో అగ్రగామిగా స్వచ్ఛతకు మారు పేరుగా పురమందిరాన్ని తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం పాల్గొని ప్రముఖ కళాకారులు రంగస్థల నటుడు వల్లకవి వేంకట సుబ్బారావును ఘనంగా సన్మానించారు. అదే విధంగా సంగీత విద్వాంసురాలు జె.బాలార్క, నాట్యాచార్యులు సురభి గాయత్రిలను నిర్వాహకులతో కలిసి సత్కరించి జ్ఞాపికలందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. టౌన్‌హాలు ట్రస్టు సభ్యులు నాగారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, వాకాటి విజయకుమార్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో నలుబోలు బలరామయ్యనాయుడు, జిల్లా ఎస్పీ తండ్రి వెంకటేశ్వరరావు, కళాకారులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు. వ్యాఖ్యాతగా ఉమాకిరణ్ వ్యవహరించారు.

# క్రమశిక్షణకు కేరాఫ్ అడ్రస్ మైథిలి స్కూల్



వార్షికోత్సవ వేడుకలో మాట్లాడుతున్న నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు చంద్రమౌళినగర్‌లోని మైథిలీ స్కూల్ ప్రారంభమై 27 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ నెల 7న ఎంతో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. చిన్నారుల ఆహ్వాన నృత్యంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. నగర మేయర్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీ మునిసిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, 27వ డివిజన్ కార్పొరేటర్ మల్లెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, 28వ డివిజన్ కార్పొరేటర్ మేకల రజనీ, ఎంఇఓ జగదీష్, పాఠశాల డైరెక్టర్ ధూర్జటి రాధా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ అజీజ్ మాట్లాడుతూ, విద్యారంగంలో విశేష సేవలు అందించి, ఇప్పుడు మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్న మైథిలి మనోహర్‌రెడ్డి సేవాకార్యక్రమాల్లో సైతం ముందుంటున్నారని అభినందించారు. మనోహర్‌రెడ్డి సమాజానికి మరిన్ని సేవలందించాలని, విద్యా రంగంలో కొత్తవరవడి సృష్టించాలని ఆయన ఆకాంక్షించారు. నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, నెల్లూరులో మైథిలి స్కూల్‌గానీ, మైథిలి మనోహర్‌రెడ్డి గానీ తెలియని వారుండరని అంటూ, అలాంటి మంచిపేరు తెచ్చుకున్న పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభా నైపుణ్యాలతో విద్యారంగంలో ముందుకు సాగుతుండడం తమకెంతో ఆనందంగా ఉందని మైథిలీ మనోహర్‌రెడ్డి అన్నారు. అనంతరం, గతేడాది 10వ తరగతిలో 10కి 10 పాయింట్లు సాధించిన మౌక్తికారెడ్డికి నగదు బహుమతి అందజేశారు.

## మాగుంట శరత్‌చంద్రారెడ్డి జన్మదినం...

# నెల్లూరులో సేవా ఉత్సవం



గత 3సంవత్సరాలుగా నెల్లూరు నగరంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి వ్యవస్థాపకుడు మాగుంట శరత్‌చంద్రారెడ్డి (చందు) జన్మదినం సందర్భంగా ఈ నెల 15న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. నెల్లూరు టౌన్‌హాల్‌లో ఆరోజున ఎంఎస్‌ఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న పలు సేవా కార్యక్రమాలలో భాగంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా స్టార్ డెంటల్ హాస్పిటల్ వారిచే ఉచిత దంత వైద్య శిబిరం, వాసన్ ఐకేర్ హాస్పిటల్ వారిచే కంటి వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని, అవసరం అయిన వారికి నెలరోజుల పాటు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహింపజేస్తామని తెలిపారు. ఆరోజు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎస్‌ఆర్ సేవాసమితి నిర్వాహకులు తెలియజేసారు.




శ్రద్ధాంజలి

మా ఇంటి దైవం, మనసున్న మంచి వ్యక్తి
మమతానురాగాలకు నిలువెత్తు రూపం
కీ॥శే॥ శ్రీ యలమంచలి పతంజలి గారు
తేది 06.04.2018 శుక్రవారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కూతుర్లు - అల్లుళ్ళు
ప్రతిమ - తానంకి నానాజీ
ప్రశాంతి - వైట్ల ప్రసాద్

భార్య : శ్రీలక్ష్మి
మనుమరాలు : లక్ష్మీ ఆకాంక్ష
మనవళ్ళు : కౌశిక్, హానీష్

ఉత్తరక్రియలు: తేది. 18.04.2018 బుధవారం సూళ్ళూరుపేట, కీర్తీ ఎన్‌క్లేవ్‌లోని వారి స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

# 'నిప్పో'కు రైట్ రైట్

- రెసిడెన్షియల్ జోన్‌గా మార్చేందుకు కౌన్సిల్ ఆమోదం
- ఎట్టకేలకు రాజకీయ రాద్ధాంతానికి తెర




*గత కొద్దికాలంగా రాజకీయ నాయకుల నోళ్ళలో నానుతూ రాజకీయ అంశంగా మారిన 'నిప్పో' పరిశ్రమకు సంబంధించిన 13.02 ఎకరాల భూమి కన్వర్షన్‌కు సంబంధించిన అంశం ఎట్టకేలకు నెల్లూరు నగరపాలక సంస్థ ఆమోదం పొందింది. 12వ తేదీ జరిగిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో విపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేసినా నిప్పో భూ వినియోగమార్పిడి అంశాన్ని ఆమోదించారు.*

నెల్లూరులో 'నిప్పో' బ్యాటరీల ఫ్యాక్టరీ ఎలా వచ్చిందో చాలామందికి తెలియదు. జపాన్ కంపెనీ భాగస్వామ్యంతో పొట్టిపాటి ఓబుళరెడ్డి నెల్లూరులో బ్యాటరీ ఉత్పత్తుల పరిశ్రమను స్థాపించాలనుకున్నారు. ఈ ప్రకారమే ప్రభుత్వానికి భూమి కోసం దరఖాస్తు చేసుకున్నారు. 1972లో 11.74ఎకరాలు, 1977లో 1.28ఎకరాలు మొత్తం 13.02ఎకరాలను మార్కెట్ ధర ప్రకారం కొని రిజిష్టర్ చేసుకున్నారు. ఆరోజు పారిశ్రామిక అవసరాల నిమిత్తమే ప్రభుత్వం నుండి భూమిని కొనుగోలు చేసి రిజిష్టర్ చేసుకున్నారు. ఇండోనేషనల్ లిమిటెడ్ పేరుతో పరిశ్రమను స్థాపించి దాదాపు నాలుగు దశాబ్దాల పాటూ దానిని నడిపారు. నెల్లూరుజిల్లాకు చెందిన వేలాదిమందికి ఉపాధి కల్పించడమేకాక, ఎన్నో కోట్లు ప్రభుత్వానికి పన్నుల రూపంలో చెల్లించారు. ప్రత్యక్షంగానే కాదు 'నిప్పో' బ్యాటరీల ద్వారా పరోక్షంగా మార్కెట్ లోనూ ఎంతోమందికి ఉపాధి లభించింది.

ఈ నలభైఏళ్ళలో నగరం విస్తరించింది. 'నిప్పో' చుట్టూ నివాసాలొచ్చేసాయి. పరిశ్రమలో ఉత్పత్తులు చేస్తుంటే వెలువడుతున్న కాలుష్యం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఇబ్బందిపడే పరిస్థితి. ఈ దశలో తాము మార్కెట్ ధరకు కొని, తమ అధీనంలో వున్న నిప్పో పరిశ్రమకు సంబంధించిన 13.02ఎకరాల భూమిని ఇండస్ట్రియల్ జోన్ నుండి కమర్షియల్, రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చాలని కోరుతూ నిప్పో యాజమాన్యం ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వం దీనిని పరిశీలించి ఆమోదం పంపమని నెల్లూరు కార్పొరేషన్‌ను కోరింది. గతంలో కౌన్సిల్‌లో రెండుసార్లు ఈ అంశాన్ని అజెండా పెట్టినప్పుడు రాజకీయ రాద్ధాంతం జరిగింది. 'నిప్పో' స్థలం ప్రభుత్వానిదని, అక్కడ పరిశ్రమ నడపకుంటే తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, పేదలకు ఇళ్ళు, గుళ్ళు, మసీదులు, చర్చిలు కట్టించాలంటూ ఆయా పార్టీల నాయకులు, సంఘాలు డిమాండ్ చేసాయి.

పరిశ్రమను పెడతానని నిప్పో ఓబుళరెడ్డి ప్రభుత్వం నుండి ఫ్రీగా భూమిని తీసుకుని వుంటే ఈరోజు వీళ్ళు చేసే డిమాండ్‌కు అర్థం పర్థం వుండేది. ఆయన ఆరోజు ఆ చుట్టుపక్కల పొలాలు ఎంత రేటున్నాయో ఈ పొలాన్ని కూడా అంతకంటే ఎక్కువ రేటు పెట్టి కొన్నాడు. ఆయన ప్రభుత్వ భూమిని కాకుండా అంతే డబ్బుతో ప్రైవేట్ భూమినే కొని వున్నా ఈరోజు వాటి విలువ కూడా వందలకోట్లకు చేరివుండేది. కాబట్టి 'నిప్పో' భూములపై వారి యాజమాన్యాన్ని ప్రశ్నించలేం. ఇక ఆ ప్రాంతమంతా నివాసాలు ఏర్పడ్డాయి కాబట్టి దానిని రెసిడెన్షియల్ జోన్‌గా మార్చడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఇక తుది నిర్ణయం ప్రభుత్వం చేతిలో వుంది.

# జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వెట్రి సెల్వి



నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్‌గా కుమారి వెట్రి సెల్విని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 10న ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జేసీగా పనిచేసిన ఏఎండి ఇంతియాజ్ గుంటూరుజిల్లా జేసీగా బదిలీ అయ్యారు. జేసీగా నియమింపబడిన వెట్రి సెల్వి ప్రస్తుతం చిత్తూరుజిల్లా మదనపల్లి సబ్‌కలెక్టర్‌గా పని చేస్తున్నారు. తమిళనాడు రాష్ట్రం కళత్తూరుకు చెందిన ఆమె మద్రాస్ యూనివర్శిటీ నుంచి ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ పట్టభద్రురాలు. 2014లో ఆమె ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ప్రకాశం జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా పని చేశారు. మొదటి పోస్టింగ్ చిత్తూరుజిల్లాలో ఇచ్చారు. సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గమైన కుప్పంకు ప్రత్యేక అధికారిగా పనిచేసి మంచిపేరు తెచ్చుకున్నారు. నెల్లూరుజిల్లా జేసీ నియామకం ఉత్తర్వులు అందుకున్న ఆమె అమరావతికెళ్ళారు. అక్కడి ఉన్నతాధికారులు రిలీవింగ్ ఆర్డర్స్ ఇచ్చిన వెంటనే నెల్లూరులో బాధ్యతలు చేపట్టనున్నారు. ఇన్‌ఛార్జ్ జేసీగా జేసీ-2 వెంకటసుబ్బారెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# చీకట్లను చీల్చుకుంటూ...




అంతరిక్ష ప్రయోగాలలో అంతర్జాతీయంగా పెద్ద దేశాలతో పోటీపడుతున్న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) మరో విజయాన్ని అందుకుంది. 12వ తేదీ గురువారం తెల్లవారుజామున శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం(షార్) నుండి ప్రయోగించిన పిఎస్ఎల్‌వి-సి41 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. తెల్లవారుజామున 4.04గంటలకు పిఎస్ఎల్‌వి-సి41 చీకట్లను చీల్చుకుంటూ నింగిలోకి దూసుకుపోయింది. మొత్తం 19నిముషాల వ్యవధిలో ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఐ ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఉపగ్రహాన్ని 143కోట్లతో, వాహకనౌకను 100కోట్లతో రూపొందించారు. స్వదేశీ నేవిగేషన్ వ్యవస్థ అభివృద్ధి కోసమే ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. ప్రయోగం విజయవంతం కాగానే షార్ అంతటా ఆనందం వెల్లివిరిసింది. శాస్త్రవేత్తలు ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు. ఇస్రో ఛైర్మెన్ శివన్ ప్రయోగాన్ని పర్యవేక్షించారు.

# ఢిల్లీలో తెలుగు పౌరుషం చాటుతాం



ప్రజాదీవెన కార్యక్రమంలో ప్రజలకు అభివాదం చేస్తున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు 16వ డివిజన్ లక్ష్మీనగర్, గుర్రాలమడుగు సంగం ప్రాంతాలలో ప్రజాదీవెన కార్యక్రమంలో భాగంగా నెల్లూరు నగర శాసనసభ్యులు డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ గడప గడపకు వెళ్ళి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలని జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రకు ప్రజలు ఆకర్షితులై వైయస్సార్ కుటుంబంలోకి వస్తుండడం సంతోషంగా ఉందన్నారు. వైయస్సార్ కుటుంబంలో చేరిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నానని, వారందరికీ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గణేశం వెంకటేశ్వర్లురెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, సగిలి జయరామిరెడ్డి, కాకుటూరు విజయభాస్కర్‌రెడ్డి, బిజి వేముల భాస్కర్‌రెడ్డి, మెట్టు శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సి.ఐలకు తాత్కాలిక పోస్టింగ్‌లు

నెల్లూరుజిల్లాలో 9మంది సి.ఐలకు తాత్కాలిక పోస్టింగ్‌లు కల్పిస్తూ గుంటూరు రేంజ్ ఐ.జి గోపాలరావు 11వ తేదీ రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సిసిఎస్‌లో వున్న అబ్దుల్ సుబాన్‌ను నెల్లూరు 1వ నగరంకు, చాలాకాలంగా విఆర్‌లో వున్న రామారావును నెల్లూరు సిసిఎస్‌కు, గూడూరు 1వ పట్టణంలో వున్న సుబ్బారావును బుచ్చిరెడ్డిపాలెం సి.ఐగా నియమించారు. విఆర్‌లో ఉన్న ఖాజా అల్తాఫ్‌హుస్సేన్‌ను ఆత్మకూరు, ఒంగోలు సిసిఎస్‌లో వున్న శ్రీనివాసరావును కలిగిరి సి.ఐగా, గుంటూరు అర్బన్ ట్రాఫిక్‌లో వున్న వేమారెడ్డిని నెల్లూరు నార్త్ ట్రాఫిక్ సి.ఐగా నియమించారు. ఆత్మకూరు సి.ఐ ఖాజావలిని కలిగిరి సి.ఐ కరుణాకర్‌రావును, నెల్లూరు నార్త్ ట్రాఫిక్ సి.ఐ వెంకట్రావును రేంజ్ విఆర్‌కు ఆదేశించారు.

# పాడిరైతుకు చేయూత

విజయ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న పాడిరైతుల శ్రేయస్సును, వారి కష్టాల్ని దృష్టిలో పెట్టుకుని పాలు కొనుగోలు ధరలను వెన్న శాతాన్ని బట్టి పెంచుతున్నట్లు డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తెలిపారు. పెంచిన ధరలు ఈ నెల 16వ తేదీ నుండి అమలులోకి వస్తాయని బుధవారం డెయిరీలోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన చెప్పారు. ఇప్పటివరకు లీటర్ పాలకు(10శాతం వెన్నతో) 51.90 రూపాయలు చెల్లిస్తుండగా, పెంచిన ధర ప్రకారం 52.90 రూపాయలు చెల్లిస్తామన్నారు. జిల్లాలో నిత్యం 140 సహకార సంఘాల ద్వారా 410 సేకరణ కేంద్రాల నుండి 29,500 లీటర్ల పాలను డెయిరీకి సేకరిస్తున్నామని, పాడి పోషణ ఆర్థిక భారంతో కూడుకున్నందున రైతులకు చేయూతనిచ్చేందుకే పాలసేకరణ ధరలు పెంచినట్లు ఆయన చెప్పారు.




## 'ప్రభా'తం

# ఆంధ్రాలో అస్తవ్యస్త పాలన

**స్వర్ణాంధ్రపాలన దిగ్విజయంగా సాగుతోందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గొప్పలు చెప్పుకుంటున్నా, అవన్నీ కేవలం ఊక దంపుడు ప్రచారార్భాటాలేనని తేలిపోయింది.. రాష్ట్రంలో ఆర్థిక నియంత్రణ అస్తవ్యస్తంగా ఉందని, నిధులు నీరుగారిపోతున్నాయని, అప్పులు, నష్టాలు భారీగాపెరుగుతున్నాయని, ఆర్థికవ్యవస్థ కుదేలైపోయిందని వీటన్నిటికీ ప్రధాన కారణం.. ఆర్థిక వ్యవస్థ తీరు సజావుగా లేకపోవడమేనని 'కాగ్' నివేదిక కుండబద్దలు కొట్టింది. దీంతో ఏమి చెప్పాలో అర్థంకాక టిడిపి నేతలు అయోమయంలో పడిపోయారు.**

స్వర్ణాంధ్రపాలన దిగ్విజయంగా సాగుతోందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గొప్పలు చెప్పుకుంటున్నా, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో పరుగులు పెట్టిస్తున్నానని పదేపదే ప్రకటించుకుంటున్నా..అవన్నీ కేవలం ఊకదంపుడు ప్రచారార్భాటాలే తప్ప వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయని తేలిపోయింది. రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా ఉందని, నిధులు నీరుగారిపోతున్నాయని, పెద్దపెద్ద ప్రాజెక్టులకు సైతం నీళ్ళొదిలేసుకోవాల్సి వస్తోందని, నష్టాలు భారీగా ఉంటున్నాయని.. అప్పులు కుప్పలు తెప్పలుగా పెరుగుతున్నాయని, ఆర్థికవ్యవస్థ అడుగంటిపోతోందని వీటన్నిటికీ ప్రధాన కారణం రాష్ట్రంలో ఆర్థిక నియంత్రణ సజావుగా లేకపోవడమేనని 'కాగ్' నివేదికలు కుండబద్దలు కొట్టాయి. ఒకవైపు అవినీతి అక్రమాలు, మరోవైపు నిర్లక్ష్యం, పొంతనలేని సర్వేలు, నిబంధనలు పాటించని వైనాలు.. అన్నీ కలిసి ఆంధ్రప్రదేశ్‌లో పాలన అస్తుబిస్తుగా మారిందని విమర్శలకు గురవుతుండడంతో ప్రభుత్వం, పాలకులు ఆత్మరక్షణ దిశలో పడిపోయి ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రాజ్యాంగబద్ధ సంస్థ అయిన 'కాగ్'(భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) అన్ని వివరాలు సమగ్రంగా పరిశీలించి, లోతుగా అధ్యయనం చేసిన తర్వాతనే నిష్పాక్షికంగా నివేదికలు అందజేస్తుందన్న విషయం అందరికీ తెలిసిందే. తాజాగా, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఇచ్చిన నివేదికల్లోని పలు అంశాలు ప్రభుత్వ అస్తవ్యస్త పాలనా తీరును ఎకిపారేయడంతో రాష్ట్ర పాలకులు ఆందోళనకు గురవుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక నిర్వహణ తీరు నుంచి ప్రభుత్వరంగ సంస్థల్లో నష్టాల వరకు, 'కాగ్' నివేదిక అనేక వాస్తవాలను బయట పెట్టింది. జాతీయ గ్రామీణ తాగునీటి పథకంలో ఏకంగా 491.83 కోట్ల నిధులు నిష్ఫలమయ్యాయని, రాష్ట్రంలో 271 చిన్న, మధ్య, భారీ తరహా ప్రాజెక్టుల్లో ఏకంగా 28వేల కోట్లకు పైగా అంచనాలు పెంచేశారని, సకాలంలో ప్రాజెక్టులు పూర్తికాకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్పష్టం చేసింది. 64 ప్రభుత్వరంగ సంస్థలు నష్టాల్లో కూరుకుపోయాయని, అవి 25,367 కోట్ల రూపాయల మేరకు నష్టాల్లో పడిపోయాయని, ఇదంతా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని 'కాగ్' తప్పుపట్టింది. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక నియంత్రణ సరిగా లేదని, వ్యయ నియంత్రణ - పర్యవేక్షణ రెండూ బలహీనంగానే ఉన్నాయని కాగ్ స్పష్టం చేసింది. కేటాయింపులకు మించి ఖర్చులు చేయడం, కొన్ని సందర్భాల్లో కేటాయించిన నిధులను ఖర్చుచేయకపోవడం వల్ల నిధులు భారీగా మిగిలిపోవడం జరిగాయని, గ్రాంట్‌లకు మించి అదనంగా ఖర్చుచేయడం కూడా నిబంధనలను అతిక్రమించినట్లేనని, మొత్తం 35 పద్దుల కింద 21,967 కోట్ల నిధులు మిగిలిపోయాయని, అదే సమయంలో 5 పద్దుల కింద 1686.83 కోట్లు అధిక ఖర్చు చేశారని, ఈ పరిస్థితుల వల్ల ప్రథమ ప్రాధాన్య అంశాలకు నిధుల లభ్యత లేకుండా చేసినట్లయిందని, ఆశించిన ఫలితాలు చేకూరేందుకు నిధులు ఇవ్వలేని పరిస్థితికి దారితీసిందని కాగ్ స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థికవ్యవస్థకు ఒక తీరుతెన్నూ లేకుండా పోయిందంటూ అక్షింతలు వేసింది. రానున్న ఏడేళ్లలో ఏకంగా 76,888 కోట్ల రూపాయల మేరకు అప్పులు చెల్లించాల్సి ఉందని, ఈ భారం బడ్జెట్‌పై ఎంతో ప్రభావం చూపుతుందని, ప్రభుత్వరంగ సంస్థలు నష్టాల్లో కూరుకుపోయి ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నాయని పేర్కొంది.

జాతీయ గ్రామీణ నీటిసరఫరా పథకం కింద రాష్ట్రంలో ఏడు పథకాలను నిర్మించినా ప్రారంభించలేకపోయారని, నీటి ఆధారం లేకపోవడమే అందుకు కారణమని, మరో ఏడు ప్రాజెక్టులు మధ్యలోనే ఆగిపోయాయని, దీంతో 491.83 కోట్లు నిష్ఫలమయ్యాయని తేల్చింది. పథకాలను పూర్తిచేయడంలో జాప్యం, పథకాలను సరైన సమయానికి ప్రారంభించలేకపోవడం వల్ల 2017 మార్చి నాటికి 110.57 కోట్లు ఖర్చు కాకుండా మిగిలిపోయిందని, పలు పథకాల పనులు ప్రారంభించకపోవడం వల్ల మరో 455.02 కోట్ల మేరకు కేంద్రం ఇచ్చిన సాయాన్ని రాష్ట్రం వినియోగించుకోలేకపోయిందని కాగ్ ప్రకటించింది. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో లోపాలవల్ల 607.51కోట్ల ఆదాయానికి గండిపడిందని, సుమారు 369 కార్యాలయాల్లో తక్కువ పన్ను విధింపు, ఆస్తివిలువ తక్కువగా నిర్ధారించడం వైరాల వల్ల ఈ నష్టం వాటిల్లిందని స్పష్టం చేసింది. అంతేకాదు, రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో సుమారు నూటపాతిక కోట్ల ఖరీదైన 431.98 ఎకరాల పంచాయతీరాజ్ భూములు ఆక్రమణల్లో ఉన్నాయని, భూ నిర్వహణకు సంబంధించిన ఆస్తుల రిజిస్టర్‌ను నిర్వహించలేదని తప్పుపట్టింది. అంతేకాక, 501.85 కోట్లకు సబంధించిన ఖర్చులకు వివరణాత్మక బిల్లులు లేవని, దాని వల్ల అసలు ఖర్చు జరిగిందో లేదో నిర్ధారించడం కష్టమని పేర్కొంటూ, ఇలాంటి తీరువల్ల అవినీతికి, నిధుల దుర్వినియోగానికి ఆస్కారం ఇచ్చినట్లవుతుందని కాగ్ స్పష్టం చేసింది. ఇలా ఎన్నో అంశాల్లో రాష్ట్ర పాలనలోని డొల్లతనాన్ని ఎండగడుతూ, ఎక్కడెక్కడ ఎలాంటి తప్పులు జరి గాయో.. జరుగుతున్నాయో లెక్కలేసి మరీ స్పష్టం చేసింది. దీంతో బిజెపికి ఊపు పెరిగింది. కేంద్రం ఇస్తున్న నిధులను వినియోగించడంలో రాష్ట్రం విఫలమవుతోందని, నిధులను దారిమళ్లిస్తోందని, పాలన అస్తవ్యస్తంగా ఉందని కొన్నాళ్ళుగా బిజెపి చేస్తున్న విమర్శలను ఇప్పుడు టిడిపి కాదనలేని పరిస్థితి ఏర్పడింది. అందులోనూ, ఎవరూ కాదనడానికి వీలులేని స్పష్టమైన 'కాగ్' నివేదిక అది. దీంతో టిడిపి ఇప్పుడు ఇరకాటంలో పడిపోయింది. చేసిన తప్పులు తప్పించుకోవడానికి.. లేని గొప్పలు చెప్పుకునే టిడిపి రాజకీయ వ్యూహం బెడిసికొట్టినట్లయింది.

ఏదేమైనా, నీతి-నిజాయితీలతో, పారదర్శకంగా ఉంటూ..సకల జనరంజకంగా ప్రగతిపథంలో ముందుకు సాగాల్సిన రాష్ట్రపాలన ఇలా అస్తవ్యస్తంగా మారుతూ విమర్శలకు గురవుతుండడం ఎంతైనా విచార కరం. ఈ విమర్శల నుంచి, ఈ అప్రదిష్ట నుంచి గట్టెక్కడానికి టిడిపి నేతలు ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకుంటారో.. మరెలాంటి వ్యూహాలు రచిస్తారో... వేచిచూడాల్సిందే మరి!...

---

# తెలుగు వైభవాన్ని చాటే మహాభారతం



తిక్కన చిత్రపటం వద్ద తిక్కన విజ్ఞాన కేంద్రం సభ్యులు

**- డాక్టర్ సంగనభట్ల**

మహాభారతంలోని కవిత్వ మాధుర్యం తెలుగుభాషా వైభవానికి ప్రతీక అని, కవిత్రయంగా ప్రఖ్యాతిచెందిన నన్నయ, తిక్కన, యర్రాప్రగడలు తమ రచనా ప్రావీణ్యంతో మహాభారతాన్ని ఆంధ్రీకరించి తెలుగు భాషా వైభవాన్ని దశదిశలా చాటారని ధర్మపురి లక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాల విశ్రాంత ఆచార్యులు డాక్టర్ సంగనభట్ల నరసయ్య అన్నారు.

ఈనెల 8న తిక్కన విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాల్ ప్రాంగణంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి (జూనియర్) స్మారకభవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 'మహాభారత కవితా మధురిమలు' అనే అంశంపై అద్భుతంగా ప్రసంగించి నిర్వాహకుల సత్కారాన్ని అందుకున్నారు. తిక్కన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి అవనిగడ్డ వెంకటకృష్ణమూర్తి, సాహితీవేత్తలు అగస్త్యరెడ్డి వెంకురెడ్డి, మోపూరు వేణుగోపాలయ్య తదితరుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

---



### శ్రీ పినాకినీ విద్యాపీఠం ఆధ్వర్యంలో...

# 20 నుంచి ఆదిశంకరాచార్య జయంతి

నెల్లూరులోని శ్రీ పినాకినీ విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 24వ తేది దాకా జగద్గురు శ్రీ ఆది శంకరాచార్య జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. నెల్లూరులో 72 సంవత్సరాల క్రితం కంచికామకోటి పీఠాధిపతులు పరమాచార్య శ్రీ జగద్గురు చంద్రశేఖర సరస్వతీ స్వామి వారి ఆశీస్సులతో స్వయంపాకుల వేంకటేశశాస్త్రి ఆధ్వర్యంలో 'శ్రీ పినాకినీ విద్యాపీఠము' ఆవిర్భవించింది. ఆనాటి నుంచి ప్రతిఏటా జగద్గురు ఆదిశంకరాచార్య జయంత్యుత్సవాలను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ సత్సంప్రదాయాన్ని నేటికీ కొనసాగిస్తూ శ్రీ పినాకినీ విద్యాపీఠం అధ్యక్ష కార్యదర్శులు స్వయంపాకుల శ్రీనివాసులు, చక్రాల వెంకట లక్ష్మీనరసింహం తదితరుల నిర్వహణలో శ్రీ ఆదిశంకరాచార్య జయంతి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది ఈనెల 20 నుంచి నెల్లూరు ట్రంకురోడ్డులోని తిప్పరాజు వేంకట సుబ్బయ్య కల్యాణసదన్‌లో జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లలిత, విష్ణు, శివ శంకరాచార్య అర్చనలు, వేదపారాయణం ఉంటాయని, సాయంత్రం ప్రదోషకాల పూజలు, లలిత-విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణతో పాటు సాయంత్రం 6.30 గంటల నుంచి ప్రముఖులచే ఆధ్యాత్మికోపన్యాసాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 20న 'నృసింహావతారము-అద్వైత తత్త్వము' అనే అంశంపై ఒంగోలుకు చెందిన బ్రహ్మశ్రీ ములుకుట్ల సుబ్రహ్మణ్యేశ్వరశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం, 21, 22తేదీల్లో 'శంకర భగవత్పాద స్తోత్రములు-అద్వైత బోధ' అనే అంశంపై చీరాలకు చెందిన బ్రహ్మశ్రీ అన్నదానం చిదంబరశాస్త్రి ప్రవచనం, 23-24 తేదీల్లో 'వ్యాసప్రోక్త భాగవత అద్వైతార్థము' అనే అంశంపై విజయవాడకు చెందిన బ్రహ్మశ్రీ ధూళిపాళ రామకృష్ణశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటాయని వారు పేర్కొన్నారు. వైశాఖ శుద్ధ పంచమి నుంచి శుద్ధ నవమి వరకు పంచాహ్నిక దీక్షతో ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగే ఈ కార్యక్రమాలకు అందరూ విచ్చేసి జయప్రదం చేయాల్సిందిగా పీఠం నిర్వాహకులు కోరుతున్నారు.

---

## ఢిల్లీకెళ్ళి ఏం సాధించారు?

సిద్ధడు అద్దంకి పోనూ పోయాడు రానూ వచ్చాడు అన్నట్లుంది ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ యాత్ర. ఢిల్లీకెళ్ళి జాతీయ రాజకీయాలలో మార్పులు తీసుకొస్తాడని, ప్రత్యేక హోదాపై అన్ని పక్షాలను ఏకం చేస్తాడనుకుంటే డ్రీమ్‌గర్ల్ హేమమాలినితో ఫోటోలు తీసుకుని వచ్చాడు. ప్రత్యేకహోదా పోరులో భాగంగా ఓ పక్క ఐదుమంది లోక్‌సభ సభ్యులు రాజీనామాలు చేసి నిరాహారదీక్షకు కూర్చున్నారు. తెలుగుదేశం ఎంపీలు రాజీనామా చేయడం లేదు. రోజుకో డ్రామా వేస్తూ చంద్రబాబు బాటలో వెళ్తున్నారు. చంద్రబాబు చెత్త రాజకీయాల వల్లే రాష్ట్రం నాశనమైంది.

జె.విశ్వనాథ్, మైదుకూరు.

## సీరియల్స్‌పై నియంత్రణ

తెలుగు టీవీ ఛానెల్స్‌లో వస్తున్న సీరియల్స్ కుటుంబ వాతావరణాన్ని కలుషితం చేసే విధంగా వుంటున్నాయి. ప్రతి సీరియల్‌లోనూ మహిళలను దుష్టశక్తులుగా చూపిస్తున్నారు. మగ నటులను దమ్మీలుగా చూపిస్తున్నారు. ఆడవాళ్ళే ప్రధాన నాయకులు... వారే విలన్‌లు... ఏ సీరియల్‌లో చూసినా కుట్రలు, కుతంత్రాలు, హత్యా పథకాలు... ఇళ్ళల్లో మహిళలు వాటిని అంతే ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సీరియల్స్ ప్రభావం కుటుంబాల మీద తీవ్రంగా ఉంటుంది. ఇలాంటి సీరియల్స్ మీద నియంత్రణ ఉండే విధంగా ప్రభుత్వం చట్టం తీసుకురావాలి.

- పులి మేఘన, నెల్లూరు.

## దారితప్పుతున్న విశ్లేషణలు

రాజకీయ నాయకులు, విశ్లేషకులు ఏమి మాట్లాడుతున్నారో తెలియదు. నాలుగేళ్ళ నుండి వికసిస్తున్న కమలాన్ని వాడిపోయినట్లు కథనాలు అల్లుతున్నారు. బీజేపీతో తెగదెంపులు చేసుకున్నాక ముస్లిం ఓట్లన్నీ తమకు పడతాయని తెలుగుదేశం వాళ్ళు కలలు కంటున్నారు. 2014 ఎన్నికల్లో బీజేపీ సానుభూతిపరుల ఓట్లు పడబట్టే తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు ఆ కొద్ది ఓట్లు దూరమైతే వైకాపా గెలుస్తుంది. ముస్లింలలోనూ బీజేపీ మద్దతుదారులున్నారు. కాబట్టే ఆ పార్టీ ఉత్తరప్రదేశ్‌లోనూ, త్రిపురలోనూ భారీ విజయాన్ని సాధించగలిగింది. మొన్న ఉపఎన్నికల్లో మూడు ఎంపీ స్థానాలలో ఓడిపోయినంత మాత్రాన బీజేపీకి పోయేదేమీ లేదు. బీజేపీని అదే పనిగా తిడితే తెలుగుదేశమే నష్టపోతుంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.



## హోదా పోరుతో...

# వ్యతిరేకత పోగొట్టుకున్నారు



***నెల్లూరుజిల్లాతో సంబంధం వున్న లోక్‌సభ సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి(నెల్లూరు), వెలగపూడి వరప్రసాద్ (తిరుపతి)లు ప్రత్యేక హోదా ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. హోదా ఉద్యమంలో చురుకుగా పాల్గొనడం ద్వారా తమ తమ నియోజకవర్గాలలో తమ పట్ల నెలకొన్న అసంతృప్తిని, వ్యతిరేకతను చాలావరకు తగ్గించుకోగలిగారు.***

ప్రత్యేకహోదా ఉద్యమంలో భాగంగా వైకాపాకు చెందిన ఐదుగురు లోక్‌సభ సభ్యులు రాజీనామా చేయడం, వెనువెంటనే ఆంధ్రాభవన్ వద్ద నిరాహారదీక్షకు కూర్చోవడం జరిగింది. ఈ ఐదుగురిలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి వయసులో పెద్దోడు. 73ఏళ్ళు. ఆ వయసులో నిరాహారదీక్ష వంటివి ఆయన ఒంటికి పడవు. అయినా పట్టుదలగా కూర్చున్నాడు. రెండోరోజే తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పోలీసులు అరెస్ట్ చేసి ఆసుపత్రికి తరలించారు. ఈ వయసులో కూడా ఆయన నిరాహారదీక్షకు కూర్చోవడం, జగన్ మాటకు కట్టుబడి రాజీనామా చేయడం వంటివన్నీ ఆయనపై ప్రజల్లో వున్న వ్యతిరేకతను చాలావరకు తగ్గించాయని చెప్పవచ్చు. 2014 ఎన్నికల్లో సిటింగ్ ఎంపీగా పోటీ చేసినప్పుడు ఆయన మీద ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వుండింది. కాబట్టే భారీ క్రాస్‌ఓటింగ్ జరిగి, లోక్‌సభ పరిధిలోని 7అసెంబ్లీలలో 5 నియోజకవర్గాలలో వైసిపి అభ్యర్థులు గెలిచినా ఈయన కేవలం 13వేల ఓట్లు మెజార్టీతో గెలిచాడు. వ్యతిరేకత లేకుంటే దాదాపు లక్ష ఓట్లు మెజార్టీ వుండాలి. రాబోయే ఎన్నికల్లో ఆయనపై అంతటి వ్యతిరేకత రాకపోవచ్చు. క్రాస్‌ఓటింగ్‌కు ఈసారి ఆస్కారం వుండదు.

తిరుపతి ఎంపీ వరప్రసాద్ మీద ఇటీవలకాలం వరకు ఆయన నియోజకవర్గ పరిధిలో వ్యతిరేకత వుండింది. వైసిపిలో కూడా కొంతమంది నాయకులు ఆయనపై అసంతృప్తితో వున్నారు. అయితే ఇటీవల ప్రత్యేకహోదా విషయంలో వరప్రసాద్ చురుకైన పాత్ర పోషించాడు. లోక్‌సభలో దీనిపై ప్రభుత్వాన్ని కదిలించేలా ప్రసంగించాడు. వైసిపి ఎంపీలలో మేకపాటి తర్వాత వయసులో ఆయనే పెద్దోడు. ఆ వయసులోనూ దీక్షకు కూర్చుని పోరాడాడు. ఏదేమైనా ఈ ఇద్దరు ఎంపీలకు ప్రత్యేకహోదా ఉద్యమం ఒక ఆక్సిజన్‌లాగా ఉపయోగపడిందని చెప్పవచ్చు.

## రైతులను ఇబ్బంది పెడితే...

# మీకు ఇబ్బందులు తప్పవు

### - మిల్లర్లకు మంత్రి హెచ్చరిక



రైస్ మిల్లర్లు, అధికారులు రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నిబద్ధతతో పనిచేయాలని, కనీస మద్దతుధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతులను ఇబ్బందిపెడితే మీరే ఇబ్బంది పడతారని హెచ్చరించారు. 9వ తేదీన నెల్లూరులోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైస్‌మిల్లర్లు ధాన్యం కొనుగోలు విషయంలో కనీస మద్దతుధర కన్నా తగ్గించి కొనడానికి వీలులేదని, అలా తగ్గించి కొన్న రైస్‌మిల్లులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో మార్చి నెలాఖరులో కురిసిన మంచు వల్ల ధాన్యం కొంత విరుగుడుకు గురైందని, ఈ బియ్యాన్ని బాయిల్‌చేసి వినియోగించుకోవచ్చని తెలిపారు. జిల్లాలో రైతులు, రైతు సంఘాలు అడగకపోయినప్పటికీ ముఖ్యమంత్రితో, సంబంధిత మంత్రితో మాట్లాడి నెల్లూరుజిల్లా రైతులకు క్వింటాకు బోనస్‌గా 210 రూపాయలు అందిస్తున్నట్లు చెప్పారు. ధాన్యం పుట్టి 15,300 రూపాయలకు కొనుగోలు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

# హైవేపై హై డేంజర్

- ప్రాణాలు పోగొట్టుకుంటున్న బైక్‌రేసర్లు
- ప్రమాదం అంచుల్లో ఆటో ప్రయాణం

జాతీయ రహదారి మీద ఆధునిక వాహనాలు వంద నుండి నూట అరవై కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతుంటాయి. ఇటీవల అన్ని కంపెనీల కార్లకు ఎయిర్‌బ్యాగ్స్ సాధారణం అయ్యాయి. ప్రమాదం జరిగినా ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ అవుతాయనే ధీమాతో కార్లను గాల్లో పోనిస్తారు. ఒక్క కార్లేం ఖర్మ... లారీలు, బస్సులు కూడా అంతే వేగంతో వెళుతుంటాయి. ఒక రకంగా ఏ టైంలో చూసినా జాతీయ రహదారి మీద వాహనాల రేస్ జరుగుతున్నట్లుగా వుంటుంది. ఇలాంటి రోడ్ల మీద బైక్‌లలో, ఆటోలలో ప్రయాణించడం ఎంతవరకు క్షేమం. హైవేపై బైక్‌లలో ప్రయాణించడం ఎంతో ప్రమాదకరం! బైక్‌లలో పోయే వాళ్ళు ఓ పక్కగా పోతారా అంటే అదీ లేదు. అడ్డదిడ్డంగా పోతుంటారు. సడెన్‌గా మలుపు తిరుగుతుంటారు. జంక్షన్‌ల వద్ద సర్రున సైడ్‌రోడ్ల మీద నుండి హైవేపైకి దూసుకొస్తుంటారు. సడెన్‌గా ఇలా హైవేపైకి వచ్చే ఆటోలు, బైక్‌లను హైవేపై వేగంగా దూసుకొస్తున్న వాహనాలు ఢీకొంటున్న సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు కేవలం గాయాలకు పరిమితం కావడం లేదు. మనుషుల ప్రాణాలే పోతున్నాయి. హైవేపై బైక్ రేసర్లు కూడా ప్రమాదకరంగా మారారు. లారీలు, బస్సులు, కార్లతో పోటీపడి బైక్‌లు తోలుతూ ప్రమాదాలకు గురవుతున్నారు.

గతంలో హైవేలపైకి ఆటోల ప్రవేశాన్ని నిషేధించారు పోలీసులు. కాని, ఇప్పటికీ ఆటోలు యధేచ్ఛగా తిరుగుతున్నాయి. జాతీయ రహదారిపై ఆటోలు, బైక్‌లను నియంత్రిస్తే కొంతవరకన్నా ప్రమాదాలను అరికట్టవచ్చు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా

**అమ్మ ఫర్నిచర్ మాల్**

మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.

Latest & New Models

ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


## ఉదయగిరిలో...

# 'రెడ్డి' కోసం 'దేశం' అన్వేషణ

> బొల్లినేనిపై వ్యతిరేకతే కారణం






***రాజకీయ చైతన్యానికి పేరుపడ్డ నియోజకవర్గంలో రాజకీయ పార్టీలకు గెలుపు పెద్దసవాలే! పార్టీ ప్రభంజనాల కంటే పోటీచేసే అభ్యర్థి ప్రభావమే ఇక్కడ ఓటర్లపై బలంగా వుంటుంది. అభ్యర్థి సమర్ధత, వ్యక్తిత్వాన్ని బట్టే ఇక్కడ గెలుపోటములుంటాయి. గత మూడున్నర దశాబ్దాల రాజకీయ చరిత్రను పరిశీలిస్తే ఇక్కడ ఏ పార్టీ ప్రభంజనం కూడా పని చేయలేదు. కేవలం నాయకుడి సమర్థతకు ప్రజలు పెద్దపీట వేసారు.***

ఉదయగిరి నియోజకవర్గంలో రెడ్డి, కమ్మ బలమైన సామాజికవర్గాలు. ఈ రెండువర్గాల నుండే ప్రధానపార్టీల అభ్యర్థులు రంగంలోకి వస్తుంటారు. ఆ వర్గాలవాళ్ళే ఎమ్మెల్యేలవుతుంటారు. 1978 నుండి తీసుకుంటే వెంకయ్యనాయుడు రెండుసార్లు, మాదాల జానకిరాం ఒకసారి, బొల్లినేని రామారావు ఒకసారి కమ్మ సామాజికవర్గం నుండి గెలిచారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఒకసారి, కంభం విజయరామిరెడ్డి రెండుసార్లు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మూడుసార్లు(2012 ఉపఎన్నికతో కలిపి) విజయం సాధించారు.

రాబోయే ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరపున ఎలాగూ మేకపాటి కుటుంబం నుండే ఎవరో ఒకరు పోటీలో వుంటారు. టీడీపీ తరపున ఎవరు రంగంలోకి వస్తారన్నదే చర్చనీయాంశంగా మారింది. సిటింగ్ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుపై నియోజకవర్గంలో వ్యతిరేకత వుంది. అయితే ఈ వ్యతిరేకత అవినీతి, అక్రమాలకు పాల్పడడం వల్లో, భూకబ్జాలు, దౌర్జన్యాలు చేయించడం వల్లో, కాంట్రాక్టర్లు, వ్యాపారుల వద్ద కమిషన్లు తీసుకోవడం వల్లో వచ్చింది కాదు, ఆయన మహారాష్ట్రలో కాంట్రాక్టర్, అక్కడ ఆయనపై ఎన్నో ఆరోపణలొచ్చాయి. కాని ఉదయగిరి నియోజకవర్గంలో అటువంటి ఆరోపణలు లేవు. కేవలం అతను నిత్యం అందుబాటులో ఉండడు. వారానికి ఒకట్రెండురోజులొస్తాడు... మండలస్థాయి నాయకులకు మాత్రమే కనిపిస్తాడు... నియోజకవర్గంలో ప్రజలకు దగ్గరగా వుండడు. జనాలకేంటంటే తమ ఇళ్ళలో చావయినా, శుభమైనా ఎమ్మెల్యే వచ్చిపోవాలి. ఈ నియోకవర్గంలో ప్రజల ఆలోచనా ధోరణి ఆ విధంగా ఉంటుంది. దీనికి బొల్లినేని రామారావు విరుద్ధం. అతను దొరకడం కష్టం. దీనివల్లే అతని మీద వ్యతిరేకత! అందుకనే బొల్లినేని ప్రత్యామ్నాయంగా 'రెడ్డి' సామాజికవర్గం నుండి ఈసారి అభ్యర్థిని గాలిస్తున్నట్లు తెలుస్తోంది. 'రెడ్డి' అభ్యర్థి అయితే అదే సామాజికవర్గం వారిలో చీలిక తేవొచ్చు. కమ్మ సామాజికవర్గం వాళ్ళు ఎలాగూ చంద్రబాబుకే ఓట్లేస్తారు. కాబట్టే ఈసారి తెలుగుదేశంలో ఈ సామాజికవర్గం వారికే అవకాశం చిక్కొచ్చు. ఈ నేపథ్యంలోనే మాజీఎమ్మెల్యే కంభంపాటి విజయరామిరెడ్డి పేరుతో పాటు వ్యాపారవేత్త కావ్య కృష్ణారెడ్డి పేరు కూడా ప్రచారంలో వుంది.


**చతుర్థ వర్ధంతి**



మానవత్వానికి ప్రతిరూపంలా నిలిచారు, దాతృత్వంతో అందరి మనసులు గెలిచారు,
శ్రమించే తత్వానికి ప్రతిబింబం మీరు... మంచిని పంచే వ్యక్తిత్వానికి పెట్టింది మీ పేరు.

మా ఉన్నతికి బాటలు వేసి, మా బంగారు భవిష్యత్‌కు మార్గదర్శకులుగా నిలిచిన మా ఇంటి దైవం

**కీ॥శే॥ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారు**

అధినేత: సిపిఆర్ కళ్యాణ మండపం, శివప్రియ లాడ్జి

పరమపదించి 18.04.2018 బుధవారం నాటికి నాలుగేళ్ళు గడుస్తాయి.

వారి దివ్యస్మృతికి మా నివాళులు.

భార్య: సుబ్బరత్నమ్మ

కుమారుడు - కోడలు: చెరుకుపల్లి పద్మనారాయణరెడ్డి - సుమతి

మనుమలు: హరీశ్వర్‌రెడ్డి, భువనేశ్వర్‌రెడ్డి

మరియు బంధుమిత్రులు

# నెల్లూరు కబుర్లు

## నెల్లూరు రోడ్లపై
# అర్థరాత్రి ఎస్పీ తనిఖీలు



ఇప్పటికే బెట్టింగ్, ఎర్రచందనం, మైనింగ్ మాఫియాలను గడగడలాడిస్తున్న జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ఇప్పుడు అకస్మాత్తుగా రోడ్లపైకి కూడా వస్తున్నాడు. అర్థరాత్రిళ్ళు తనిఖీలు నిర్వహిస్తూ మందుబాబులు, చీకటి శక్తుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తిస్తున్నాడు. ఈనెల 10వతేదీ అర్థరాత్రి ఆయన నెల్లూరు నగరంలో హల్‌చల్ చేసారు. అర్థరాత్రి వేళ కూడా కొన్ని ఏరియాలలో వైన్‌షాపుల వద్ద జనం వుండడాన్ని గమనించారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్ణీత సమయానికి వైన్‌షాపులు మూసేయాలని లేకుంటే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల దొంగతనాలు, చీకటి నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో రాత్రిపూట గస్తీని ఆయన పరిశీలించారు.


# ఎక్సైజ్ సి.ఐ ఇంట్లో దొంగతనం
## ● పోలీసుల అదుపులో నిందితులు



పోలీసులకు వివరాలు తెలియజేస్తున్న ఎక్సైజ్ సి.ఐ కుటుంబసభ్యులు

దొంగలకు పోలీసు అని లేదు, సాధారణ ప్రజలని లేదు... దోచుకోవడానికి ఎవరైనా ఒక్కటే! సొమ్ము కోసం ఎవరి ఇళ్ళనైనా దోచుకుంటామని చాటిచెప్పారు దొంగలు. నెల్లూరు, మూలాపేటలోని చమ్మండివారి వీధిలో వుంటున్న ఎక్సైజ్ సి.ఐ ఖాజామొహిద్దీన్ ఇంట్లో దొంగలు పడ్డారు. 40లక్షల విలువచేసే ఒకటిన్నర కిలోల బంగారు, 2లక్షల నగదు దోచుకుపోయారు. ఖాజామొహిద్దీన్ తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో ఎక్సైజ్ సి.ఐగా పనిచేస్తున్నారు. 8వ తేదీ తన రెండోకూతురుకు తిరుపతిలో జెఇఇ మెయిన్స్ పరీక్ష వుండడంతో భార్య వరలక్ష్మితో కలిసి ఆరోజు తెల్లవారుజామునే ఇంటికి తాళం వేసి తిరుపతికి వెళ్ళిపోయాడు. ఆగంతకులు దీనిని పసిగట్టి పక్క ఇంటి మీద నుండి ఖాజామొహిద్దీన్ ఇంట్లోకి ప్రవేశించి బీరువాను పగులగొట్టి అందులో వున్న సొత్తును అపహరించారు. పోలీసులు వెనువెంటనే నిందితులను పట్టుకున్నట్లు తెలుస్తోంది.

# ఈ రోడ్డుపై నిర్లక్ష్యం



కావలి వైపు నుండి జాతీయ రహదారి మీదుగా నెల్లూరు నగరంలోకి ప్రవేశించడానికి ప్రధానమార్గం ఇనమడుగు జంక్షన్ రోడ్డు. ఒకప్పటి జాతీయ రహదారి కూడా ఇదే! నెల్లూరుకు బైపాస్ వచ్చినప్పటికి కావలి వైపు నుండి వచ్చే బస్సులు, కావలి వెళ్ళే బస్సులు, నగరంలోకి రావాలనుకున్న ఇతర వాహనాల వారికి ఇదే ప్రధాన రహదారి. బైపాస్ వచ్చినప్పటికి ఈ రోడ్డుపై ఏ మాత్రం ట్రాఫిక్ తగ్గకపోగా నానాటికీ పెరుగుతూనే వుంది. నెల్లూరు నగరానికి ఉత్తరం దిక్కున ప్రధాన ప్రవేశమార్గమైన ఈ రోడ్డును నెల్లూరుకు పెద్దబైపాస్ వచ్చినప్పటి నుండి అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కోవూరు ఫ్లై ఓవర్ నుండి వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు ఈ రహదారిని నాలుగులైన్లుగా విస్తరించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు నగర ప్రవేశ మార్గం అందంగా తయారవుతుంది.

# నగరానికి ఇవి కావాలి
## బస్టాప్‌లు... ఫుట్‌ఓవర్ వంతెనలు

**నెల్లూరు నగరంలో రోడ్లు, దుమ్ము అనే సమస్య ఉండనే వుంది. ఇది ఈరోజు కాకపోతే ఇంకొద్ది రోజులకన్నా సర్దుకుంటుంది. నగరంలో ట్రాఫిక్ ఎక్కువ. రోడ్లు తక్కువ. నెల్లూరులో ట్రాఫిక్ అంతా కూడా ట్రంకురోడ్డు, మినీబైపాస్‌ల మీదే నడుస్తుంటుంది. ట్రాఫిక్‌ను సరిదిద్దడం కోసం ఇక రోడ్లను వెడల్పు చేసే పరిస్థితి లేదు. కాకపోతే కొత్తగా విస్తరించే ఏరియాలలో విశాలమైన రోడ్లను ఏర్పాటు చేస్త భవిష్యత్‌లో మంచిది.**



నగరంలో ట్రాఫిక్ ప్రక్షాళనలో ప్రధానంగా కావాల్సింది బస్టాప్, ఆటోస్టాప్ పాయింట్లు, నగరంలో ఇప్పుడు బస్‌స్టాప్‌లు లేవని కాదు... కాని చాలా బస్‌షెల్టర్లు మనుగడలో లేవు. అదీగాక సిటీబస్సులు, ఆటోలు ఎక్కడంటే అక్కడ ఆగుతూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నాయి. హైదరాబాద్, విజయవాడ సిటీలలో మాదిరిగా బస్టాప్‌లు ఏర్పాటు చేసి, బస్‌లు ఆటోలు అక్కడ మాత్రమే ఆగేలా చేయాలి. అట్లాగే నగరంలో ఎక్కడా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు లేవు. ట్రంకురోడ్డు, మినీబైపాస్‌లలో అటు నుండి ఇటు, ఇటు నుండి అటు ఎక్కడబడితే అక్కడ రోడ్డు దాటేస్తుంటారు. దీనివల్ల ట్రాఫిక్‌కు అవరోధమేర్పడుతుంది. కనకమహల్ సెంటర్ నుండి కెవిఆర్ పెట్రోల్ బంకు దాకా రెండు లేదా మూడుచోట్ల ఫుట్‌ఓవర్ వంతెనలు నిర్మిస్తే పాదచారులకు ఇబ్బంది ఉండదు!

# మితిమీరిన వేధింపులు
## చావుకు సిద్ధమవుతున్న అధికారులు



కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

తమ శాఖలో మితిమీరిన వేధింపులు... ఉన్నతాధికారుల ఒత్తిళ్ళు... ఫలితంగా ఉద్యోగులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. డిప్రెషన్‌లో పడి చావుకు కూడా సిద్ధపడుతున్నారు. ఇలాంటి సంఘటనే 9వ తేదీ సోమవారం నెల్లూరులో చోటుచేసుకుంది. తన శాఖలో నెలకొన్న అశాంతి, ఒత్తిళ్ళ మూలంగా జిల్లా పౌర సరఫరాల అధికారి ఎన్.కృష్ణారెడ్డి తన ఛాంబర్‌లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఆఫీసు సిబ్బంది సకాలంలో తలుపులు పగలగొట్టి ఆయనను కిమ్స్(బొల్లినేని) ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రమాదం లేనట్లే!

కర్నూలు జిల్లాకు చెందిన కృష్ణారెడ్డి 2017లో నెల్లూరుజిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్‌గా వచ్చాడు. పద్ధతిగానే పనిచేసుకుంటున్నాడు. 9వ తేదీ ఆర్ అండ్ బి బంగ్లాలో వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి కూడా హాజరయ్యాడు. సమావేశం నుండి వచ్చిన ఆయన తన ఛాంబర్‌లోకి వెళ్ళి తలుపులు వేసుకున్నాడు. వెంటనే ఒక అధికారికి ఫోన్ చేసి తన బాధనంతా చెప్పుకుని తాను ఇక బ్రతకనని చెప్పి ఫోన్ పెట్టేసాడు. తర్వాత తన భార్యకు ఫోన్ చేసి నువ్వు, పిల్లలు జాగ్రత్త అని, ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. దీంతో గాబరాపడ్డ ఆమె వెంటనే ఆఫీసుకు ఫోన్ చేసి సిబ్బందికి విషయం చెప్పింది. వెంటనే వాళ్ళు అప్రమత్తమై తలుపులు పగలగొట్టి ఫ్యాన్‌కు ఉరేసుకోబోతున్న ఆయనను కిందకు దించి కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలియగానే సహచర అధికారులు, ఉద్యోగులు కిమ్స్ ఆసుపత్రికి పరుగులు తీసారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్ళి ఆయనను పరామర్శించి, కృష్ణారెడ్డి భార్యకు ధైర్యం చెప్పారు. ధాన్యం కొనుగోలు, సిఎంఆర్ బకాయిలు, పైఅధికారుల ఒత్తిళ్ళు, మందలింపుల నేపథ్యంలోనే కృష్ణారెడ్డి ఈ అఘాయిత్యానికి పాల్పడబోయినట్లు తెలుస్తోంది.

# ఇన్‌ఛార్జ్ ఉపకులపతిగా రాజేంద్రప్రసాద్!




రాజేంద్రప్రసాద్‌ను అభినందిస్తున్న విఎస్‌యు సిబ్బంది

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ వైస్ ఛాన్స్‌లర్‌గా ఎ.రాజేంద్రప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విఎస్‌యు వైస్‌ఛాన్స్‌లర్‌గా వున్న వి.వీరయ్య పదవీకాలం ఈ నెల 9వ తేదీతో ముగిసింది. దీంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్‌గా వున్న రాజేంద్రప్రసాద్‌కే నెల్లూరు విఎస్‌యు ఇన్‌ఛార్జ్ విసి బాధ్యతలు అప్పగించారు. ఆయన 10వ తేదీ ఛార్జ్ తీసుకున్నారు.

# కుళాయి పన్ను పెరిగింది

నెల్లూరు నగరపాలక సంస్థవారు ఉన్నట్లుండి కుళాయిల పన్ను పెంచారు. ఆ పెంచడం కూడా ఒకేసారి నూరు నుంచి 200కు పెంచి తమ ప్రతాపం చూపించాలనుకున్నారు. మొన్నటిదాకా 100 రూపాయలున్న కుళాయి పన్ను ఇప్పుడు ఒకేసారి 200కు పెంచాలని నిర్ణయించడం ఏమిటని నగరప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ఇప్పటికే అధికారికంగా 36వేల దాకా కుళాయి కనెక్షన్లున్నాయి. అనధికారికంగా.. అక్రమంగా మరెన్ని కుళాయిలున్నాయో చెప్పలేం. అయినా, వాటి గురించి అసలు పట్టించుకునేవారే లేరు. ప్రస్తుతం ఈ పన్ను ద్వారా 3.60 లక్షలు వసూలవుతుండగా, ఇక నుంచి పెంచిన పన్ను దెబ్బతో నెలనెలా 7.20లక్షలు వస్తుందని కార్పొరేషన్ వారి అంచనా కాబోలు.

# తపాలా మరియు టెలిఫోన్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

నెల్లూరుజిల్లా తపాలా మరియు టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల సహకార పరపతి సంఘం లిమిటెడ్, నెల్లూరు నూతన పాలకవర్గ ఎన్నికకు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అథారిటీ అధికారి నోటిఫికేషన్ విడుదల చేశారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఐ.శ్రీనివాసమూర్తిని ఈ ఎన్నికల అధికారిగా నియమించారు. సంఘంలో 9మంది డైరెక్టర్ల ఎన్నికకు 16వ తేదీన నామినేషన్లు స్వీకరిస్తారు. 17వ తేదీ నామినేషన్లను పరిశీలిస్తారు. 18వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు తుదిగడువు. 9మంది మాత్రమే బరిలోవుంటే ఆరోజే డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. అంతకుమించి ఎక్కువ నామినేషన్లు వస్తే ఈ నెల 22వ తేదీన నెల్లూరు, దర్గామిట్టలోని శ్రీ కస్తూరిదేవి బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహిస్తారు.

# దివ్యాంగుల సేవే... దేవుడి సేవ!

## - రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ఈ నెల 10వ తేదీన నెల్లూరులోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ముగ్గురు దివ్యాంగులకు ట్రైసైకిళ్ళు, వీల్‌ఛైర్‌లను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు అన్ని విధాలా సహకార మందించేందుకు తానెప్పుడూ ముందుం టానని చెప్పాడు. దాతలు, స్నేహితుల సహాయ సహకారాలతో ఇప్పటివరకు రూరల్ నియోజకవర్గంలో 500మందికి పైగా దివ్యాంగ సోదరులకు ట్రైసైకిళ్ళు, వినికిడి యంత్రాలు, హ్యాండ్ స్టిక్‌లు, వీల్ ఛైర్‌లు పంపిణీ చేసామన్నారు. ఆపదలో వున్న వారికి, అనాధలకి మనం అండగా నిలిస్తే, దేవుడు మన కుటుంబాలకు అండగా నిలుస్తాడని ఆయన పేర్కొన్నాడు.


ట్రైసైకిళ్ళను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

మన కుటుంబాలలో వివాహాలు, జన్మ దినాలకు అనేక లక్షలు ఖర్చుపెడతామని, అందులో కొంత భాగాన్ని దివ్యాంగులు, అనాధల కోసం ఖర్చు పెట్టాలని ఆయన విజ్ఞప్తి చేసారు. దివ్యాంగులకు సేవ చేయడ మంటే దేవుడికి సేవ చేయడమేనన్నారు.

# 'పలకరింపు' భేష్!

## - వైద్యారోగ్యశాఖ జేడీ డా.రామారావు

జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పలకరింపు' కార్యక్రమం, వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం సక్రమంగా ఉం దంటూ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులను, సిబ్బందిని వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామారావు అభినందిం చారు. ఆరోగ్యకేంద్రాల్లో గర్భిణీస్త్రీలకు, చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, అదేవిధంగా చంద్రన్న సంచార చికిత్సకు సంబంధించిన ప్రణాళిక ప్రతి గ్రామంలో, పాఠశాల, అంగన్‌వాడి సెంటర్‌లలో అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని జాతీయ ఆర్యోగ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌ఓ వరసుందరం, డిసిహెచ్‌ఎస్



డాక్టర్ సుబ్బారావు, అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రమాదేవి, డిటిసిఓ డాక్టర్ జివి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పార్కుల అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యత

## - పురపాలక మంత్రి నారాయణ

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు క్రీడా మైదానాలు, పార్కుల అభివృద్ధి కోసం పుష్కలంగా నిధులు కేటాయిస్తున్నారని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా. పి.నారాయణ అన్నారు. ఈ నెల 8న మంత్రి నెల్లూరులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, జిల్లాలో పార్కుల అభివృద్ధి కోసం ప్రభుత్వం 800కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిందన్నారు. స్థానికుల కోరిక మేరకు చిల్డ్రన్స్‌పార్క్‌లోని స్కేటింగ్ ట్రాక్ వెడల్పు చేయాల్సిందిగా అధికారులకు ఆదేశాలిచ్చామని, మరో నాలుగు నెలల్లో అది పూర్తవుతుందని తెలిపారు. అదేవిధంగా ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో


చిల్డ్రన్స్ పార్క్‌లోని మ్యూజికల్ ఫౌంటేన్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

స్కేటింగ్ ట్రాక్ ఏర్పాటుకు స్థలం కేటాయించడం జరిగిందని, ఇది మరో ఆరునెలల్లో పూర్తవుతుందని చెప్పారు. ఊరిబయట స్థలాలున్నాయని, అంతర్జాతీయ క్రీడామైదానం రెండు ఎకరాల్లో నిర్మాణాలు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని పార్కుల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలో రోడ్లు రెండు వైపులా తవ్వడం వల్ల ప్రజలకు అసౌకర్యంగా ఉన్న మాట వాస్తవమేనని, అక్టోబర్ దాకా ఈ సమస్య ఉంటుందన్నారు. వర్షం వచ్చి రోడ్లు సింక్ అయితే, రోడ్లు వేసేందుకు బావుం టుందన్నారు. డిసెంబర్‌కల్లా రోడ్ల నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట నగర మేయర్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాళ్ళపాక అనూరాధ, కార్పొరేషన్ కమిషనర్ ఆలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

మాకు మార్గదర్శకులు
మా పెద్దాయన

మా పురోభివృద్ధికి కారకులు
మా వెన్నుతట్టి ముందుకు నడిపిన మంచి వ్యక్తి
మా భవిష్యత్తుకు భరోసానిచ్చిన మహోన్నత శక్తి
మా "పెద్దాయన"
నాలుగవ వర్ధంతి సందర్భంగా
ఆ మహనీయుని స్మరించుకుంటూ...



షేక్ రియాజ్ బాషా
రియాజ్ హైదరాబాద్ లైటింగ్ హౌస్ & హైరర్స్
మాగుంట లే అవుట్, నెల్లూరు. సెల్. 94402 76032



శ్రీ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారు
అధినేత: సిపిఆర్ కల్యాణ మండపం, శివప్రియ లాడ్జి

# ప్రకృతి నుండే నానో టెక్నాలజీ భావనలు

- భవిష్యత్తులో మానవాళికి ఎంతో ఉపయోగం
- విఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ చెన్నుపాటి స్పష్టీకరణ



నాయుడమ్మ అవార్డ్‌ను డాక్టర్ అప్పసాని కృష్ణారావు చేతుల మీదుగా అందుకుంటున్న ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ చెన్నుపాటి జగదీష్. (మధ్యలో) డా. ఏ.జగదీష్.

ప్రకృతి నుండే మనకు నానో టెక్నాలజీ భావనలు కలిగి అర్ధం చేసుకోవడం జరిగిందని, రానున్న రోజుల్లో మానవాళికి నానో టెక్నాలజీ ఎంతో ఉపయోగంగా ఉండబోతుందని ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్శిటీ ఎలక్ట్రానిక్స్ మెటీరియల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ చెన్నుపాటి జగదీష్ అన్నారు. నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఈ నెల 6న నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ నిర్వహించిన 'నాయుడమ్మ అవార్డ్–2017' ప్రదానోత్సవ కార్యక్రమంలో డాక్టర్ చెన్నుపాటి ప్రసంగించారు. విశ్వవిఖ్యాత ప్రొఫెసర్ యలవర్తి నాయుడమ్మ 22వ స్మారక ఉపన్యాసంలో ఆయన మాట్లాడుతూ, సీతాకోకచిలుక రెక్కలపై ఉండే పలురకాల రంగులు నానో కణాల ప్రభావం వల్ల ఏర్పడినవేనని గుర్తించారని, అదేవిధంగా తామరాకు నీటిలో ఉన్నా తడవకపోవడానికి కూడా నానో కణాల నిర్మాణం ప్రభావం వల్లనేనని తేటతెల్లమైందన్నారు. ఈ నానో టెక్నాలజీని ఉపయోగించే ఇప్పుడు నీటిలో తడవని పదార్థాలను, రకరకాల పెయింట్లను తయారుచేస్తున్నారని వివరించారు. భవిష్యత్తులో నానో టెక్నాలజీ అనువర్తనాలు, వైద్యారోగ్య, సమాచార సాంకేతికత తదితర ఎన్నో రంగాలలో ఉపయోగకరంగా ఉండనున్నాయన్నారు. విద్యార్థులు వీలైనంతవరకు భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, వృక్షశాస్త్రం తదితర కీలకమైన శాస్త్రాలను అధ్యయనం చేయాల్సివుందని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర సైన్స్‌సిటీ వైస్‌ఛైర్మెన్–సిఇఓ డాక్టర్ అప్పసాని కృష్ణారావు మాట్లాడుతూ, ప్రొఫెసర్ నాయుడమ్మ ప్రపంచప్రఖ్యాతి చెందిన శాస్త్రవేత్త అని, ఆయనో గొప్ప దార్శనికులని కొనియాడారు. ప్రొ.నాయుడమ్మ పేరుతో ప్రతి ఏటా అవార్డ్‌ను ఆయారంగాల్లో విశిష్టసేవలందిస్తున్న ప్రముఖులకు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ డైరెక్టర్, ప్రఖ్యాత ప్రత్యామ్నాయ ఇంధనవనరుల శాస్త్రవేత్త డాక్టర్ ఏ.జగదీష్ మాట్లాడుతూ, నాయుడమ్మ శాస్త్రవేత్తగా మానవాళికి అందించిన సేవలను, నాయుడమ్మ అవార్డు విశిష్టతను, తమ సంస్థ స్థాపన లక్ష్యాలను వివరించారు. అనంతరం, డాక్టర్ చెన్నుపాటి జగదీష్‌కు డాక్టర్ అప్పసాని కృష్ణారావు చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన నాయుడమ్మ అవార్డును బహుకరించి శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. డాక్టర్ ఎన్‌వి సురేంద్రబాబు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్, కార్యదర్శి వై.వినయ్‌కుమార్‌లతో పాటు అధ్యాపకులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ దేవసేన

గూడూరు పట్టణాన్ని శుభ్రంగా ఉంచడంలో మున్సిపల్ కార్మికుల కృషి మరువలేనిదని గూడూరు పురపాలక సంఘం అధ్యక్షురాలు పొణకా దేవసేన అన్నారు. పురపాలక సంఘం కార్యాలయంలో వైస్ ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్‌లతో కలిసి ఇటీవల కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ పురపాలక సంఘంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ పథకాలను అందించేలా కృషి చేస్తామని చెప్పారు. కార్మికులకు మౌలిక వసతులను కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, జి.భారతి, విజయమ్మ, చంద్రయ్య, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### సి.ఆర్.రెడ్డి కళ్యాణ మండపంలో
### 15న చాగంటి ప్రవచనాలు

**- డాక్టర్ సి.రోహిణి**



ఈ నెల 14వ తేదీ డాక్టర్ సి.ఆర్.రెడ్డి కళ్యాణ మండపంలో సీతారాముల కళ్యాణాన్ని, 15వ తేదీన రుక్మిణీ కళ్యాణంపై చాగంటి ప్రవచనం ఉంటుందని గూడూరు పట్టణానికి చెందిన డాక్టర్ సి.రోహిణి, డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8వ తేదీ వారి నివాసంలో డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ రుక్మిణీ కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఈ నెల 15న చాగంటి కోటేశ్వరరావు ప్రవచించనున్నారన్నారు. సీతారామ కళ్యాణం, రుక్మిణి కళ్యాణాన్ని ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని వీక్షించి తరించాలని ఆమె ఈ సందర్భంగా కోరారు.



ఈ నెల 8వ తేదీన 'హౌస్ ఫర్ ఆల్' స్కీంలో భాగంగా గూడూరు మున్సిపాలిటీలో నిర్మిస్తున్న అపార్టమెంట్ల సముదాయాన్ని పరిశీలించి, లబ్దిదారులతో ముఖాముఖి నిర్వహిస్తున్న మంత్రి పొంగూరు నారాయణ. పక్కన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్ తదితరులు

## ప్రత్యేకహోదా ఆంధ్రుల హక్కు

**- మేరిగ మురళి**



రిలే దీక్షలు చేస్తున్న వైకాపా నాయకులు

ప్రత్యేకహోదా ఆంధ్రుల హక్కు అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరితో ఐదుకోట్ల మంది ఆంధ్రులకు అన్యాయం జరుగుతోందని వైకాపా గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళి తెలిపారు. వైకాపా ఎంపీలు చేపట్టిన నిరాహారదీక్షకు మద్దతుగా ఇటీవల గూడూరు రోడ్లు భవనాల అతిథిగృహం సమీపంలో పార్టీ నాయకులతో కలిసి రిలేదీక్షలను నిర్వహించారు. ముందుగా దివంగత మాజీముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ అధినేత జగన్మోహన్ రెడ్డి నిజాయితీతో మొదటి నుంచి ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పార్టీ ఎంపీలతో రాజీనామాలు చేయించారన్నారు. చంద్రబాబునాయుడు ప్రయత్నించి ఉంటే ఎప్పుడో ప్రత్యేకహోదా వచ్చేదని, నాడు ప్యాకేజీ కావాలని నేడు ప్రత్యేకహోదా కోరుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ప్రత్యేకహోదా వచ్చేంత వరకు వైకాపా పోరాటం చేస్తుందని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు నేదురుమల్లి పద్మనాభరెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, బత్తిని విజయకుమార్, నాశిన నాగులు, రాజారెడ్డి, ఉదయ్‌కుమార్, దశరథరామిరెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకంటి రామ్మోహన్‌రావు, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డిలకు
## రోటరీ వెస్ట్ సన్మానాలు





గూడూరులో ఆడిటర్‌గా 40సంవత్సరాలు పూర్తి చేసుకున్న శ్రీకంటి రామ్మోహన్‌రావు, రోటరీ డిస్ట్రిక్ట్ మాజీగవర్నర్ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డిలను ఇటీవల గూడూరు రోటరీ భవనంలో రోటరీ వెస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ వెస్ట్ ప్రతినిధులు నాశిన నాగులు మాట్లాడుతూ ఆడిటర్‌గా రామ్మోహన్‌రావు సేవలు ప్రజలకు చేరువ చేయాలని తెలిపారు. ఆయన సేవలు అభినందనీయమన్నారు. రోటరీ అంతర్జాతీయ అవార్డు అందుకోవడంతో సురేంద్రరెడ్డికి మరింత బాధ్యత పెరిగిందని కొనియాడారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీతలు రామ్మోహన్‌రావు, సురేంద్రరెడ్డి మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు, వెస్ట్‌క్లబ్ ప్రతినిధులు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, ఎన్.ఎస్.రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కె.మునిగిరీష్, శేగు శ్రీనివాసులు, వాసుగౌడ్, దశరథరామిరెడ్డి, దయాకర్‌రెడ్డి, కె.సుందరరామిరెడ్డి, పిఎమ్ రావు, బాల కృష్ణంరాజు, కృష్ణయ్య, జానకిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాసమస్యలు వెంటనే పరిష్కరించాలి

**- తహాశీల్దార్ వెంకటేశ్వర్లు**

ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకొంటానని తహాశీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. గూడూరు తహాశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అనేక గ్రామాల నుంచి ప్రజలు తమ సమస్యలపై తహాశీల్దార్‌కు వినతులు సమర్పించారు. సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు. కాగా గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో అరుణ్‌బాబు ప్రజావిజ్ఞప్తుల దినాన్ని నిర్వహించారు. గూడూరు డివిజన్ పరిధిలోని పలు గ్రామాల ప్రజల సమస్యలపై ఆర్డీవోకు వినతి పత్రాలను అందించారు. సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని ఆర్డీవో తెలిపారు.

## మేషం

అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగులు పబ్లిక్‌తోను అధికారులతోను జాగ్రత్తగా మెలగండి. స్థిరాస్తులపై ఆదాయం, షేర్ల వ్యాపారాలలో కొద్దిపాటి లాభాలుంటాయి. ఆరోగ్యం ఒక మోస్తరుగా ఉంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. వస్తు వాహన రిపేర్లుంటాయి. ఉద్యోగార్థులకు చిన్న అవకాశాలుం టాయి. అనుకున్న పనులు శ్రమతో సాగిస్తారు. వృత్తి ఉద్యోగ బాధ్యతలలో ఇబ్బందులను అధిగమిస్తారు.

## కన్య

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. బిడ్డల ఉద్యోగ వివాహాల ప్రయత్నాలు ఫలించగలవు. అనుకోని ప్రయాణాలు, ప్రముఖులను, ఆత్మీయులను కలుసుకోవడం జరుగుతుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. సమావేశాలలో మీ సూచనలకు ఆమోదం లభిస్తుంది. ఆర్థికావకాశాలకు ఆఫర్లు లభిస్తాయి. ఆస్తి వ్యవహారాలు, బాకీ వ్యవహారాలు ఒక సర్దుబాటుకు వస్తాయి.

## వృశ్చికం

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

పూజా కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. గృహ వస్తు వాహన రిపేర్లుండగలవు. జీవిత భాగస్వామి సలహాలు పాటించండి మేలు జరుగుతుంది. ఆరోగ్యం స్వల్పంగా లోపించి బాధపడతారు. ఉద్యోగులకు స్థానమార్పులు ప్రమోషన్లు వంటివి వస్తాయి. విద్యార్థులకు మంచి ప్రగతి ఉంటుంది. ప్రముఖులతో పరిచయాలుంటాయి.

## వృషభం

కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

వృత్తిపరంగా రాణిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరకవచ్చును. అనుకున్న పనులు సమర్థవంతంగా జరుపుతున్నా అప్పుడప్పుడు టెన్షన్ పడుతుంటారు. మీ వ్యక్తిత్వానికి మంచి విలువ గౌరవముంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఆర్థిక పరిస్థితి బాగుంటుంది. ఆదాయం సంతృప్తికరం. దైవకార్యాలలో ప్రముఖపాత్ర వహిస్తారు.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 13.4.2018 నుండి
తేది. 19.4.2018 వరకు

ఈ వారం మీనంలో బుధ రవి, 15తేది నుండి మేషంలో రవి, మేషంలో శుక్రుడు, కుంభ మీన మేష వృషభాలలో చంద్రుడు, కర్కాటకంలో రాహువు, తులలో గురువు, ధనుస్సులో శనికుజులు, మకరంలో కేతువు సంచరిస్తారు.

**పంచాంగము :**

14తేది శనివారం తమిళ సంవత్సరాది ముహూర్తములు లేవు.

**చైత్ర మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 13 | శుక్ర | ద్వాదశి | ఉ॥ గం.7.12ని॥ |
| తేది. 14 | శని | త్రయోదశి | ఉ॥ గం.7.45ని॥ |
| తేది. 15 | ఆది | చతుర్దశి | ఉ॥ గం.7.50ని॥ |
| తేది. 16 | సోమ | అమావాస్య | ఉ॥ గం.7.12ని॥ |

**వైశాఖ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 17 | మంగళ | పాడ్యమి | ఉ॥ గం.6.27ని॥ |
| | విదప | విదియ | రా॥ గం.5.12ని॥ |
| తేది. 18 | బుధ | తదియ | రా॥ గం.3.28ని॥ |
| తేది. 19 | గురు | చతుర్థి | రా॥ గం.1.24ని॥ |

## ధనుస్సు

మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అప్పుడప్పుడు పిల్లల ఉద్యోగ, వివాహ ప్రయత్నాలను గూర్చిన ఆందోళన ఉంటుంది. ఉద్యోగులకు పని భారం పెరుగుతుంది మరియు అధికారుల అభీష్టాలకు అనుగుణంగా నడుచుకోవలసి వస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. కోర్టు కేసులు, ఆస్తి వ్యవహారాలు వాయిదా పడతాయి. సాహిత్య కళ క్రీడా రంగాల వారికి అవకాశాలు లభిస్తాయి.

## మిథునం

మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

పన్నులు, చెల్లింపులు తప్పనిసరిగా ఉంటాయి. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం జరుగుతుంది. రావలసిన బాకీలు కొంత మొత్తం అందవచ్చును. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఉద్యోగులు, అధికారులతో, పబ్లిక్‌తో జాగ్రత్తగా వ్యవహరించండి. ఉద్యోగ ప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలు లభించగలవు. ఆరోగ్యం సరిగా ఉండదు.

## మకరం

ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

దూర ప్రయాణాలుంటాయి. ఓర్పు, లౌక్యంతో పనులు సాధించగలరు. సోదర వర్గానికి మేలు జరుగుతుంది. చిన్న విషయాలపై ఇంట్లో వారితో తగాదాలు రావచ్చును. ఆరోగ్యం బాగుంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. ఇంటర్వ్యూలకు తయారౌతారు. క్రొత్త వ్యాపారాలకు, భాగస్వామ్య వ్యాపారాలకు నిర్ణయాలు జరుగవచ్చును. స్థిరాస్తులు, షేర్లపై లాభాలుంటాయి.

## కర్కాటకం

పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

షేర్లు స్వల్ప లాభాలనందిస్తాయి. కోర్టు కేసులు వాయిదా పడవచ్చును. సహచరులను ఆదుకోవడం, వృత్తి పరంగా ఇబ్బందులను ఎదుర్కొనడం జరుగుతుంది. ఉద్యోగులకు అధికారవర్గంతో సాన్నిహిత్యం కలుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలలో వున్న వారికి చిరు అవకాశాలు దొరకగలవు. భూములు, ఇండ్ల స్థలాల కొనుగోలు, ఆలోచన ప్రయత్నాలుంటాయి.

## కుంభం

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కాంట్రాక్టులు, లీజులు పొడిగింపబడటం, ప్రభుత్వ అనుమతులు దొరకడం జరుగుతుంది. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. బంధుమిత్ర వర్గాలకు యధోచిత సహాయం అందిస్తారు. అధికారులకు స్థానమార్పు ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకడం జరుగుతుంది. అనుకోని ప్రయాణాలుంటాయి. పట్టుదలతో శ్రమించి అనుకున్న పనులు సాధిస్తారు.

## సింహం

మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

క్రొత్త వ్యాపారాలు ప్రారంభించడం, వ్యాపార భాగస్వామ్యాలు దొరకడం జరుగుతుంది. పనులందు టెన్షన్ ఉంటుంది. ఉద్యోగులు సమర్ధవంతంగా వ్యవహరిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరుకుతాయి. అనవసర వ్యవహారాలలోకి లాగడానికి ఇతరులు ప్రయత్నిస్తారు. కాబట్టి జాగ్రత్తపడండి. విద్యా ప్రగతి బాగుంటుంది. ఋణాలు మంజూరు కాగలవు.

## తుల

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వర్గర్లతో యజమానులకు సమస్యలు ఏర్పడవచ్చును. దైవ కార్యక్రమాలలో, శుభకార్యాలలోను పాల్గొంటారు. అనుకోని ఆదాయం వస్తు ధన రూపంలో లభించగలదు. ఉద్యోగ ప్రయత్నాలు చేసే వారికి చిన్న అవకాశాలు దొరకగలవు. అనవసర వివాదాలలో తల దూర్చకుండా జాగ్రత్తపడండి. మీ ఆలోచనలు, పథకాలు, ఆర్థిక స్థితిని పెంచుకొనడానికి ఉపయోగపడతాయి.

## మీనం

పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

శరీర శ్రమ, విశ్రాంతి లేకపోవడం వల్ల ఆరోగ్యం సరిగా ఉండదు. ఉద్యోగావకాశాలు లభించగలవు. ఉద్యోగులకు విధి నిర్వహణలో సమర్థత, అధికారులతో చనువు లభిస్తుంది. విలువైన వస్తువులు, గృహోపకరణాలు కొంటారు. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆర్థిక వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయకండి.

# ప్రత్యేకహోదా కోసం లోకేష్ ప్రపంచ యాత్ర

శ్రీను గల్పిక


ఉండవల్లిలోని హైటెక్‌రత్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నివాసం... ఎంపీలు సుజనాచౌదరి, సీఎం రమేష్, కంభంపాటి రామ్మోహన్‌రావు, జేసీ దివాకర్‌రెడ్డి, మురళీమోహన్, రామ్మోహన్‌నాయుడు, గల్లా జయదేవ్, అశోక్ గజపతిరాజు, మంత్రులు పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పత్తిపాటి పుల్లారావు, నిమ్మకాయల చినరాజప్పలు అక్కడ వున్నారు. మురళీమోహన్ వుండి... సార్, వైకాపా ఎంపీలు రాజీనామాలు చేసి నిరాహారదీక్షకు కూర్చున్నారు. ప్రత్యేకహోదా ఉద్యమం క్రెడిట్ వాళ్ళకు పోకుండా డైవర్ట్ చేయడానికి ఏదో ఒక మార్గం చెప్పండి, మమ్మల్ని రాజీనామాలు చేయమనకుండా అని అడిగాడు. అందుకు చంద్రబాబు... మీరు రాజీనామాలు చేస్తానన్నా నేను చేయనివ్వనులే... మీరందరూ ప్రధాని నివాసం ముందు ధర్నాకు పోతున్నామని ప్రెస్‌కు చెప్పి బయలుదేరండి... ఈలోపు మన మీడియాలో దీని మీద వార్తలొస్తాయి. అలాగే ప్రధాని ఇంటి వద్ద టీడీపీ ఎంపీలకు ఉగ్రవాదుల నుండి పొంచి వున్న ముప్పు అని మన మీడియానే దప్పు కొడుతుంది. ఆటోమేటిగ్గా మీరు ధర్నా చేసే పని లేకుండానే పోలీసులు అరెస్ట్ చేసి మిమ్మల్ని మీ ఇళ్ళల్లో వదిలిపెడతారు. అటు ధర్నాకు వెళ్లినట్లు ఉంటుంది, ఇటు మోడీ ఇంటి ముందు ధర్నా చేసే పరిస్థితి తప్పుతుంది. మీరు ధర్నాకు కూర్చుని అతన్ని రెచ్చగొడితే, దాని ప్రభావం నా మీద పడుతుంది అని చెప్పాడు. ఇంతలో 'అంబే' అనే అరుపు వినిపించింది. అందరూ అటువైపు చూసారు... 'మామగారు' సినిమాలో అడుక్కునే బాబూమోహన్‌లా ఓ వ్యక్తి చేతిలో బొచ్చె, ఇంకో చేతిలో కర్ర పట్టుకుని వున్నాడు. చంద్రబాబు కోపంగా... ఎవర్రా అడుక్కునేవాళ్ళను లోపలకు పంపించింది ఇంత సీరియస్‌గా మీటింగ్ జరుగుతుంటే అని అడిగాడు. ఈలోపు భువనేశ్వరీదేవి లోపల నుండి అన్నం గిన్నెతో వచ్చి అతని బొచ్చెలో అన్నం వేసింది. అప్పుడా వ్యక్తి మూతి మీద వున్న మీసం, బుగ్గ మీద వున్న పులిపిరి కాయ తీసాడు. అందరూ ఆశ్చర్యపోయారు. అరె మా ఎంపీ శివప్రసాద్... అని ఒక్క సారిగా అన్నారు. ఏంటీ గెటప్ అని చంద్రబాబు నవ్వుతూ అడిగాడు. ప్రధాని నరేంద్ర మోడీ ముందు చివరి ప్రయత్నం సార్, ప్రత్యేకహోదాను అడుక్కుంటున్నట్లు ఈరోజు ఈ వేషం కట్టాను అని చెప్పాడు. అంతలో అక్కడకు మంత్రి లోకేష్ వచ్చాడు. నాన్నారు మీరు ప్రత్యేకహోదా కోసం ఢిల్లీ యాత్ర చేసొచ్చారు కదా అని అడిగాడు. అవును అని చంద్రబాబు చెప్పాడు. హేమమాలిని ఆంటీని కలిసొచ్చారు కదా అని మళ్ళీ లోకేష్ అడిగాడు. అవును అని మళ్ళీ చంద్రబాబు చెప్పాడు. ప్రత్యేకహోదా కోసం నేను కూడా ఒక యాత్ర చేద్దామనుకుంటున్నాను అని అన్నాడు. ఆ మాటకు చంద్రబాబు ఆనందంగా... రాష్ట్రమంతా పాదయాత్ర చేద్దామనుకుంటున్నావా... ఇప్పుడే మన మీడియాను పిలిపించి అనౌన్స్ చేయిస్తాను అని ఆత్రుతగా అడిగాడు. అది జగన్ లెవల్... నేను ప్రపంచ యాత్ర చేద్దామనుకుంటున్నాను. అది మన హైదరాబాద్ నుండే మొదలు పెడతాను అని లోకేష్ చెప్పాడు. ఆ మాటకు చంద్రబాబుకు ఏమీ అర్థం కాలేదు. ప్రత్యేకహోదాకు ప్రపంచ యాత్రకు సంబంధమేంటని చంద్రబాబు అడిగాడు. దానికి లోకేష్ చిరాగ్గా... అందుకే మిమ్మల్ని సినిమాలు, సీరియల్స్, టామ్ అండ్ జెర్రీ, డోరేమాన్ వంటివి చూడమనేది. ఇంతవయసుకొచ్చాక కూడా మీకేమీ తెలియదు. ప్రపంచ యాత్ర అంటే ప్రత్యేకహోదా కోసం ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టడం. మీరు ఢిల్లీ వెళ్ళి హేమమాలిని ఆంటీని, అరవింద్ కేజ్రీవాల్ అంకుల్‌ను మాత్రమే కలిసారు. నేను మొదట హైదరాబాద్ వెళతాను, కేసీఆర్ అంకుల్, కేటీఆర్ బ్రదర్‌తో పాటు తమన్నా, అనుష్క, కాజల్, శ్రీరెడ్డి వంటి వారిని కలిసి వారి మద్దతు కూడగడతా, అలాగే ముంబై కెళ్ళి అమీర్‌ఖాన్, సల్మాన్ ఖాన్, షారూఖ్‌ఖాన్, దీపికా పదుకొనే, కత్రినా కైఫ్, సోనాక్షి సిన్హాలను కలిసి ప్రత్యేకహోదాకు వారి మద్దతును సమీకరిస్తా... ప్రత్యేకహోదా పత్రంపై వారందరి చేత సంతకాలు చేయిస్తా! అలాగే అమెరికా వెళ్ళి డోనాల్డ్ ట్రంప్, ఇవాంకా ట్రంప్, హిల్లరీ క్లింటన్, బిల్ క్లింటన్, బ్రిటన్‌కు వెళ్ళి థెరిస్సామే, గోర్డన్, రష్యాకు వెళ్ళి పుతిన్, గోర్బచెవ్, జపాన్‌కు వెళ్ళి షింజో అబే, చైనాకు వెళ్ళి జిన్‌పింగ్, పాకిస్థాన్‌కు వెళ్ళి నవాజ్‌షరీఫ్, శ్రీలంకకు వెళ్ళి రణిల్‌సింఘే, జర్మనీకి వెళ్ళి ఏంజెలా మోర్కెల్, ఇజ్రాయిల్‌కు వెళ్ళి నెతన్యాహు... ఇలా అన్ని దేశాలు తిరిగి అక్కడి పాలకుల మద్దతు సేకరించడమే కాక, హాలీవుడ్ తారలు మడోన్నా, పాప్ స్టార్ బ్రిట్నీ, ఏంజిలినా జూలి, కిమ్ కర్దాషైన్, జెన్నీఫర్ లారెన్స్, ఆర్నాల్డ్, లియనార్డో డికాప్రియోల మద్దతు కూడగడతాను. ప్రపంచ దేశాలన్నీ మనకు మద్దతు తెలిపితే ప్రధాని నరేంద్ర మోడీ వచ్చినట్లు దిగిరావాల్సిందే... ప్రత్యేకహోదా ఇవ్వాల్సిందే అని లాజిక్‌గా చెప్పాడు. ఆ మాటకు చంద్రబాబు నోరెళ్ళబెట్టగా అక్కడున్న మంత్రులు, ఎమ్మెల్యేలు సార్, లోకేష్‌తో పాటు మేం కూడా ప్రపంచయాత్రకు పోతాం సార్, ఆయన పోరాట మార్గమే బాగుంది అని హుషారు చూపసాగారు. చంద్రబాబు తేరుకుని... ఎవరక్కడ అని కేకేసాడు. పి.ఎ పరుగెత్తుకుంటూ వచ్చాడు. మనం మొన్న స్వీడన్ నుండి ఒక్కోదానికి ఒకటిన్నర లక్ష ఖర్చు పెట్టి తెప్పించిన సైకిళ్ళు తెమ్మన్నాడు. పి.ఎ వెళ్ళి కొద్దిసేపటికి సైకిళ్ళు తెచ్చాడు. లోకేష్‌తో చంద్రబాబు... ప్రపంచయాత్ర తర్వాత ముందు సైకిల్‌యాత్ర మొదలు పెట్టు... ఏదో ఒక కార్యక్రమం చేసినట్లుంటుంది... పనిలో పనిగా ఒంటికీ మంచిది అని టీవీ 10×5 = 105 ఛానెల్‌కు ఫోన్ చేసి మా లోకేష్ ప్రత్యేకహోదా కోసం సైకిల్ యాత్ర చేస్తున్నాడు. సెవెన్త్ పాస్ టెన్త్ ఫెయిల్ అయిన విలేకరి ఎవరన్నా ఉంటే పంపించండి... ఇంటర్వ్యూ చేయడానికి అని చంద్రబాబు చెప్పి పెట్టేసాడు.

★★★★★

అమరావతి నుండి లోకేష్ సైకిల్ యాత్రను చంద్రబాబు పసుపు పచ్చ జెండా ఊపి ప్రారంభించాడు. లోకేష్ సైకిల్ తొక్కుతుండగా పక్కనే సైకిల్ తొక్కుతూ 10×5=105 విలేకరి పరబ్రహ్మం... ఢిల్లీలో జనసేన ఎంపీలు రాజీనామాలు చేసి నిరాహారదీక్ష చేస్తున్నారుగా... దీనిపై మీరేమంటారని అడిగాడు. దానికి లోకేష్... ఆ తెలుగుదేశం ఎంపీలు కూడా రాజీనామా చేసి నిరాహారదీక్షకు కూర్చుంటే పోరాటం ఇంకా గట్టి పడుతుంది. తెలుగుదేశం ఎంపీలకు ఏ మాత్రం సిగ్గు, లజ్జ వున్నా వెంటనే రాజీనామా చేసి నిరాహారదీక్షకు కూర్చోవాలని డిమాండ్ చేస్తున్నా అని చెప్పాడు. ఆ మాటకు అక్కడున్న తెలుగుదేశం ఎంపీలందరూ తల బాదుకుని ఇతనికి సైకిల్‌యాత్ర కాదు ప్రపంచ యాత్రే కరెక్ట్ అని కోరస్‌గా అన్నారు.

# కోలా సారధ్యంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవం


బీజేపీ నాయకుల మోటార్‌సైకిల్ ర్యాలీ



## శ్రీకాళహస్తి న్యూస్

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో బిజెపి నాయకుడు కోలా ఆనందకుమార్ నేతృత్వంలో ఈ నెల 6న బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీకాళహస్తిలో ఎటుచూసినా కమలం జెండాలు రెపరెపలాడాయి. ఈ సందర్భంగా సుమారు వెయ్యిమంది బిజెపి నాయకులు, కార్యకర్తలతో వెయ్యి మోటార్ బైక్‌లతో జరిగిన బిజెపి ర్యాలీ అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కోలా ఆనంద మాట్లాడుతూ, కర్నాటక ఎన్నికల తర్వాత ఆంధ్రరాష్ట్రంలో బిజెపి తిరుగులేని శక్తిగా ఆవిర్భవిస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం నిరుపేదల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అనేక సంక్షేమ పథకాల్లో అత్యధిక వాటా కేంద్రప్రభుత్వానిదేనని, దేశాన్ని ప్రపంచదేశాల్లో అగ్రగామిగా నిలిపేందుకు నరేంద్రమోడీ, అమిత్‌షా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, రాష్ట్ర కిసాన్‌మోర్చా కార్యదర్శి వి.మనోహర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వి.సుబ్రహ్మణ్యంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శైలజ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక హోదాకు కేంద్రం దిగిరావాలి

**- మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు**



ప్రత్యేకహోదా ఆంధ్రుల హక్కు అని, రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇచ్చేందుకు కేంద్రం దిగిరావాలని మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు అన్నారు. శ్రీకాళహస్తిలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఇటీవల జరిగిన ధర్నాందోళనలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆంధ్రాకు ప్రత్యేకహోదా ఇచ్చేందుకు ప్రధాని మోడీ ఎందుకింత తాత్సారం చేస్తున్నారో అర్థం కావడంలేదని, ఆంధ్రా అంటే మోడీకి ఎందుకంత అక్కసని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తెలుగుదేశం, బిజెపి మంచిమిత్రులుగా ఉంటూ దేశంలో బిజెపి పాలన రావడానికి టిడిపి ఎంతగానో దోహదపడిందన్నారు. అయితే, బ్రిటిష్ పాలకులకన్నా మోడీ ప్రభుత్వమే నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఆంధ్రుల ఆత్మగౌరవం దెబ్బతినేలా కేంద్రం వ్యవహరించడం దారుణమన్నారు. ఈ ధర్నాలో శాప్ మాజీ ఛైర్మెన్ పిఆర్ మోహన్, ట్రస్ట్‌బోర్డ్ మాజీ సభ్యుడు లోకనాథంనాయుడు, ఎస్‌సివి తనయుడు ఎస్‌సివి దిలీప్, మాజీ మునిసిపల్ ఛైర్మెన్ డా.మ్యాగీక్లారా, మాజీ ఎంపిపి కోవి చంద్రయ్య, నారాయణ, కౌన్సిలర్లు ప్రసాద్‌నాయుడు, జయ, కంఠా ఉదయ్‌కుమార్, టిడిపి నాయకులు సుమతి, పఠాన్ ఫరీద్, హరినాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

### కొండ్రెడ్డి అన్నమ్మ



విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మాతృమూర్తి కొండ్రెడ్డి అన్నమ్మ ఈ నెల 9వ తేదీ స్వర్గస్తురాలైనారు. ఆమె వయసు 83సంవత్సరాలు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విజయ డెయిరి ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఆమెకు పెద్దకొడుకు. ఆమె భర్త కొండ్రెడ్డి దశరధరామిరెడ్డి నార్తమోపూరులోని వరదరాజు స్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు ఛైర్మెన్‌గా దేవాలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. అన్నమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తూ... నెలరోజుల వ్యవధిలోనే పిన్నమ్మను, అమ్మను పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో వున్న రంగన్నకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### మేడా అశోక్‌కుమార్‌రెడ్డి



నెల్లూరు క్లబ్ అధ్యక్షులు, అల్లూరు మాజీ సర్పంచ్ మేడా అశోక్‌కుమార్‌రెడ్డి ఈ నెల 8వ తేదీన గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. ఆయన వయస్సు 59సంవత్సరాలు. ఆయనకు ఒక కుమార్తె, కుమారుడు వున్నారు. నెల్లూరు క్లబ్‌కు 30ఏళ్ల తర్వాత గత ఏడాది జరిగిన ఎన్నికల్లో ఆయన అధ్యక్షుడిగా విజయం సాధించాడు. గతంలో క్లబ్‌కు కార్యదర్శిగా సేవలందించాడు. అల్లూరుకు సర్పంచ్‌గా పనిచేయడమే కాకుండా తన తర్వాత కూడా తన అనుచరులను గ్రామ సర్పంచ్‌లుగా గెలిపించుకున్న ఘనత ఆయనది. అల్లూరు పోలేరమ్మ గుడికి పెద్దకాపుగా వ్యవహరిస్తూ అమ్మవారి జాతరలో కీలకపాత్ర పోషించేవారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### యలమంచలి పతంజలి



పెంచలకోన దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ ఛైర్మెన్ తానంకి నానాజీ మామగారైన యలమంచలి పతంజలి ఈ నెల 6వ తేదీన డి.వి.సత్రం మండలం పోలిరెడ్డిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో దుర్మరణం చెందారు. తన సొంత కారులో ఆయన సూళ్లూరుపేట వైపు వెళ్తుండగా పోలిరెడ్డిపాలెం వద్ద ఇటీవల మంటలు రేగి దగ్ధమై నిలిచివున్న కారును తప్పించబోయి ఈయన కారు తిరగబడింది. ఈ క్రమంలో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. పతంజలికి ఇద్దరు కూతుర్లు. నానాజీ పెద్దల్లుడు. పతంజలి సబ్‌కాంట్రాక్ట్ పనులు నిర్వహిస్తూ సూళ్లూరుపేటలోని కీర్తి ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్నాడు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## వైఎస్సార్సీపి రిలే దీక్షలు



ప్రత్యేకహోదా సాధన కోసం పార్లమెంట్ సభ్యులు రాజీనామాలు చేసి ఆమరణ నిరాహారదీక్షలు చేస్తున్న వారికి సంఘీభావంగా శ్రీకాళహస్తి పట్టణంలో వైఎస్సార్సీపి ఇన్‌ఛార్జి బియ్యపు మధుసూదన్‌రెడ్డి రిలే దీక్షలు నిర్వహించారు. వైఎస్సార్సీపి జిల్లా ప్రతినిధి అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ దీక్షలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో మాత్రమే రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధించగలమని ప్రజలు నమ్ముతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి జిల్లా ప్రతినిధి శ్రీనివాసులు, వయ్యాల కృష్ణారెడ్డి, కె. మధుశేఖర్, గోపి, మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# బురిడీ బాబా అరెస్ట్


సుధాకర్ బాబా


వివరాలను వెల్లడిస్తున్న డిఎస్పీ, సి.ఐ

భక్తి ముసుగులో భక్తులను నిలువునా మోసం చేసి మంత్ర పీఠికల పేరుతో దాదాపు 10కోట్ల దాకా వసూలు చేసి జనాన్ని గొర్రెలను చేసిన సుధాకర్ మహరాజ్‌ను నెల్లూరురూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన నాగవాసవిని పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే!

ఒకప్పుడు జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడిగా వుండి, జడ్పీ ఛైర్మెన్‌లు, ఎమ్మెల్యేల వద్ద పి.సిగా పనిచేసిన సుధాకర్‌రావు సుధాకర్ మహరాజ్‌గా మారి నెల్లూరు మైపాడు గేటు సెంటర్‌లోని ప్రశాంతి నగర్‌లో సొంతంగా ఆశ్రమం ఏర్పాటు చేసుకున్నాడు. తాను పి.సిగా పనిచేసిన రాజకీయ నాయకులనే తన భక్తులుగా మార్చుకున్నాడు. విఐపిలు వస్తుండే సరికి సామాన్య ప్రజలు కూడా ఇతని వద్ద ఏవో మహిమలున్నాయని చెప్పి భక్తులుగా మారారు. ఇలా భక్తుల సంఖ్య రోజురోజుకీ పెరగడంతో ఆశ్రమం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వెలిగిపోయింది. భక్తుల నమ్మకం మితిమీరడంతో దానిని సొమ్ము చేసుకునే పన్నాగంలో భాగంగా మంత్ర పీఠికల పేరుతో వ్యాపారం మొదలుపెట్టాడు. ఇలా మంత్ర పీఠికల పేరుతో భక్తుల నుండి కోట్లలో వసూలు చేసారు. ఈ వసూలైన సొమ్మును ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆశ్రమం నుండి తరలించే ప్రయత్నం చేస్తుండగా స్థానిక భక్తులు అడ్డుకోవడంతో వీరి బండారం బయటపడింది. తన బండారం బయటపడడంతో సుధాకర్‌బాబా ఆరోజే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పూనుకున్నాడు. అతన్ని సింహపురి ఆసుపత్రిలో వుంచి బాగా కోలుకున్నాక ఇప్పుడు అరెస్ట్ చేశారు. అలాగే డబ్బు సంచులతో ఉడాయించబోయిన సూత్రధారి నాగవాసవిని కూడా ఇంతకుముందే అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన మిగతా నిందితులను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని రూరల్ డిఎస్పీ రాఘవరెడ్డి 11వ తేదీ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిందితులు డిపాజిట్లు, మంత్ర పీఠికల పేరుతో 10కోట్ల వరకు వసూలు చేసారని, అందులో కొంత సొమ్ము భక్తులకు, డిపాజిటర్లకు చెల్లించారని చెప్పారు. సుధాకర్ బాబా ఆధీనంలో వున్న 28 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని, ఈ సొమ్మును నష్టపోయిన బాధితులకు చట్టప్రకారం చెల్లిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రూరల్ సి.ఐ బి.శ్రీనివాసరెడ్డి కూడా పాల్గొన్నారు.

# పూలే జీవితం.. మార్గదర్శకం

**- జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్**



మహాత్మాపూలే జీవితం అందరికీ మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అన్నారు. ఈనెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శ్రీ వేంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, సమాజ శ్రేయస్సుకోసం నిరంతరం పోరాటం చేసిన మహనీయుడు మహాత్మాజ్యోతిరావు పూలే అని కొనియాడారు. కులవివక్ష, సతీసహగమనం వంటి సాంఘిక దురాచారాలు ప్రబలివున్న కాలంలో నిరుపేదలకు కూడా చదువు ఆవశ్యకతను తెలియజెప్పి పూలే సమాజానికి మార్గదర్శనం చేశారన్నారు. నెల్లూరులో బిసి భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, జిల్లాలో 9 కోట్లతో 3 అంబేద్కర్ భవనాలు ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తామని, త్వరలో కావలిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుచేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జేసీ వెంకటసుబ్బారెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు మధుసూదన్‌రావు, ఆరంబాకం చంద్రశేఖర్, పెంచలయ్య, జనార్ధన్‌రాజు, పద్మజ, కోట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఉన్నత విద్య పథకం ద్వారా యశ్వంత్ అనే విద్యార్థికి వైద్యవిద్య కోసం జిల్లా కలెక్టర్, తదితర అధికారుల సమక్షంలో 10 లక్షల చెక్కును అందజేశారు.

## వ్యవసాయశాఖ జేడీగా వేణుకృష్ణ

జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ బి.చంద్రనాయక్‌ను అనంతపురంకు బదిలీ చేస్తూ వ్యవసాయశాఖ కమిషనర్ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఆత్మ పి.డిగా పనిచేస్తున్న కె.వేణుకృష్ణను డిప్యూటేషన్‌పై నెల్లూరు వ్యవసాయశాఖ జె.డిగా నియమించారు. చంద్రనాయక్ ఏడాది క్రితమే అనంతపురం జిల్లా నుండి నెల్లూరు జె.డిగా వచ్చారు. డిప్యూటేషన్‌పై మళ్ళీ అక్కడికే పంపారు.

# 'రత్నం'... మళ్ళీ రత్నమే!

- ఇంటర్ బైపిసిలో స్టేట్ ఫస్ట్
- సింహపురి కీర్తిని చాటిన లక్ష్మీకీర్తి



విద్యారంగంలో 'రత్నం' విజయ కేతనం ఎగరేసింది. విద్యలో తమ సత్తాను చాటుతూ 'రత్నం' విద్యార్థులు సింహపురి సీమ కీర్తిని దశదిశలా చాటారు. ఎంతో కష్టసాధ్యమైన 'స్టేట్ ఫస్ట్' ర్యాంకును సాధించి రత్నం విద్యాసంస్థల ఖ్యాతిని మరింతగా జగద్విదితం చేశారు. ఒకవైపు నెల్లూరు సీమలోని షార్ నుంచి రాకెట్లు అద్వితీయమైన రీతిలో విజయవిహారం చేస్తుంటే, మరోవైపు విద్యారంగంలోనూ 'రత్నం' విద్యాసంస్థలు రాకెట్ వేగంతో దూసుకుపోతూ విద్యార్థుల భవితకు బంగారుబాటలు వేస్తూ అందరి ప్రశంసలూ అందుకుంటున్నాయి.

గురువారం వెల్లడైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో 'రత్నం' విద్యాసంస్థల విద్యార్థులు విజయదుంధుభి మోగించారు. బైపిసి విభాగంలో స్టేట్ ఫస్ట్ సాధించి తమ సత్తా చాటుకున్నారు. బైపిసి విభాగంలో 'రత్నం' విద్యార్థిని ఎన్.లక్ష్మీకీర్తి (హాల్‌టికెట్ నం.1808212943) రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలచి 'రత్నం' విద్యాసంస్థలకు, తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులందరికీ కీర్తిని తెచ్చిపెట్టింది. 990 మార్కులతో స్టేట్ ఫస్ట్ సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. ఇంకా పలువురు 'రత్నం' విద్యార్థులు ఈ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి 'రత్నం' విద్యాసంస్థలకే కాక, సింహపురి కీర్తి కేతనాన్ని రెపరెపలాడించారు. వారు కేవలం విద్యార్థులు కాదు.. విద్యా రత్నాలు అనిపించుకున్నారు. విద్యలో ఆణిముత్యాలనిపించుకున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో తామే ప్రథమస్థానమని నిరూపించుకోవడమే కాక, ఇంటర్ బైపిసిలో 988, 985, 983, 982 మార్కులు కూడా సాధించారు. ఈ క్రమంలోనే ముగ్గురు విద్యార్థులు 981 మార్కులు సాధించగా, మరో ముగ్గురు విద్యార్థులు 980 మార్కులు సాధించారు. ఇలా 980 నుంచి అత్యుత్తమమైన 990 మార్కులు సాధించి స్టేట్‌ఫస్ట్ సాధించిన విద్యార్థులు రత్నం విద్యాసంస్థలవారు కావడం 'రత్నం' విద్యాసంస్థల బోధనా ప్రతిభకు నిదర్శనం. ప్రజ్ఞాపాటవాలతో విద్యలో రాణించాలనుకునే విద్యార్థులకు నెల్లూరులోని 'రత్నం' విద్యాసంస్థలు పుట్టిళ్ళు లాంటివని వేరే చెప్పనక్కర లేదు. ఎంతోకాలంగా ఈ విషయం అందరికీ తెలిసిందే. రాష్ట్ర స్థాయిలో పేరెన్నికగన్న విద్యాసంస్థలివి. 'రత్నం' విద్యా సంస్థలంటేనే.. చదువుల తల్లి నిలయమనే ప్రఖ్యాతి ఎంతోకాలం నుంచి ఉంది. శీలేన శోభతే విద్య!..అనే మంచి సూక్తితో ప్రారంభమైన ఈ విద్యాసంస్థలు అనతికాలంలోనే ఎంతో ఉన్నతస్థాయి ఫలితాలు సాధిస్తూ విద్యార్థులందరికీ మార్గదర్శకమయ్యాయి.

దేశీయ విద్యా విధానంలో వచ్చే మార్పులను అందిపుచ్చుకోవడంలో అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ రత్నందే పైచేయిగా వుంటుంది. ఎంసెట్‌లో ర్యాంకుల కింగ్ తొలినుంచి రత్నమే! 2016లో ఎంసెట్ శకం ముగిసి దేశ వ్యాప్తంగా నీట్‌ని ప్రవేశపెట్టినప్పుడు, మెడికల్ విభాగంలో ఫస్ట్ ర్యాంకు సాధించింది రత్నమే! ఆ యేడాది రత్నం విద్యార్థిని హేమలత మెడిసిన్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. ఇప్పుడు ఇంటర్‌లో మార్కుల విధానానికి స్వస్తి పలికి గ్రేడ్‌లను అమలు చేయబోతున్నారు. ఈ మార్పును కూడా రత్నం ఒకటవ ర్యాంకుతోనే అందిపుచ్చుకుని తన సత్తాను చాటింది.

ఏదేమైనా, రత్నం విద్యాసంస్థలను విద్యలో అగ్రగామిగా తీర్చిదిద్దుతూ నెల్లూరుసీమలో విద్యా రత్నంగా.. అనర్ఘ రత్నంగా ప్రకాశిస్తున్న 'రత్నం' విద్యాసంస్థల అధినేత కె.వి రత్నం ఎంతైనా అభినందనీయులు. తాజాగా సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో స్టేట్ ఫస్ట్ సాధించిన విద్యార్థిని ఎన్.లక్ష్మీకీర్తికి, విద్యారంగంలో నెల్లూరు కీర్తిని చాటుతున్న రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి రత్నం గారికీ ఈ సందర్భంగా.. 'లాయర్' శుభాభినందనలు.



## వేమిరెడ్డికి శుభాకాంక్షలు

తే.గీ: అందుకొనుము ప్రభాకరా హార్థికముగ
జన్మదిన శుభాకాంక్షలు జనుల నుండి
కనగ, కలియుగ దైవమ్ముగా వెలుంగు
వేంకటేశుండు మిమ్ము దీవించుగాక!

ఆ.వె: రాజ్యసభను జేరి రమణీయ రీతిలో
తెలుగు ప్రజల పలుకు తెలియజేయ
వేమిరెడ్డి వంశ విభవా! వినయశీల!
ఆదరింతురు మిము.. ఆంధ్రులెల్ల!

తే.గీ: బడుగు బలహీనవర్గాల బాగు కొరకు
వివిధ పథకాలు యువతకు వెలుగు చూప
రాజకీయ రంగమ్మున రాణకెక్కి
పేరుగాంచవలయు మీరు పృథివి యందు!

ఆ.వె: ధనము చేతనుండి దానమ్ము జేయుచు
ప్రజల మనసులందు పదిలమగుచు
జన్మ సార్థకమని జనులెల్ల పొగడంగ
అలరుచుండు మిమ్ము అభినతింతు!

తే.గీ: ఆదరమ్మున అభిమాన అప్పుడైన
అన్న జగనన్న బాటలో నడుగు లిడుచు
సవ్యసాచియై ముందుకు సాగవలయు
అందజేతురు ఆశీస్సు.. ఆంధ్రులెపుడు!...

- వనం సుబ్రహ్మణ్యం

విపిఆర్ జన్మదినం సందర్భంగా...

చినపడుగుపాడు, 94415 94897

## పెద్దపోస్టాఫీసు సెంటర్లో ఆటోస్టాండ్

నెల్లూరు నగరంలోని 45వ డివిజన్ పరిధిలోని పెద్దపోస్టాఫీసు సెంటర్‌లో టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో ఈ నెల 8న ఏర్పాటు చేసిన ఆటోస్టాండ్‌ను మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను విధిగా పాటించాలని సూచించారు. చంద్రన్న బీమా నమోదు చేయించుకోవాలని కోరారు. మహేంద్రరెడ్డి, సత్యనాగేశ్వరరావు, సురేష్‌రెడ్డి, ఏడుకొండలు, ఆటో యూనియన్ నాయకులు గోపాల్, నూరుద్దీన్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ఆంధ్రా!

(మొదటి పేజీ తరువాయి)

దోచుకున్నారన్నది బీజేపీ నాయకులు లెక్కలతో సహా చెబుతున్నారు. ఈ ప్రభుత్వంలో పోలవరం పెద్ద స్కాం. 16వేల కోట్ల అంచనాలను ప్రభుత్వం 58వేల కోట్లకు తీసుకుపోయింది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి వేసిన అంచనాలను చూస్తే కళ్ళు బైర్లు కమ్మక తప్పదు. ఈ ప్రభుత్వంలో అతిపెద్ద బూటకం అమరావతి రాజధాని. మూడు పైర్లు పండే 35వేల ఎకరాల మాగాణి పొలాలను రాజధాని కోసం తీసుకున్నారు. నాలుగేళ్ళుగా విదేశీయాత్రలు, గ్రాఫిక్ డిజైన్లు తప్పితే రాజధాని నిర్మాణంలో అడుగు ముందుకు పడింది లేదు. 700 కోట్లు పెట్టి తాత్కాలిక భవనాలను కట్టుకున్నారు. అది కూడా చదరపు అడుగు 8వేల రూపాయల ఖర్చుతో! ప్రపంచంలోనే ఇంత రేటు ఎక్కడా ఉండదేమో! రాజధాని నిర్మాణానికంటూ కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్ళించారు. కట్టని భవనాలను కట్టినట్లుగా యూసీలు పంపారు. రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి ప్రతిపక్ష పార్టీ ఎంపీలను, ఎమ్మెల్యేలను కొన్నారు. ఓటు నోటు కేసు ఎలాగూ పెండింగ్‌లో ఉంది.

ఇక నోట్ల రద్దు తర్వాత అన్ని రాష్ట్రాల కంటే కరెన్సీ మన రాష్ట్రానికే ఎక్కువగా వచ్చింది. అయితే ఇప్పటికీ ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలోనే కరెన్సీ కొరత ఏర్పడుతోంది. వచ్చే ఎన్నికల కోసం తెలుగుదేశం నాయకులే కరెన్సీని డంప్ చేస్తున్నారనే సమాచారం కేంద్రం వద్ద వుంది. టీటీడీ బోర్డు మెంబర్ శేఖర్‌రెడ్డి ఇంట్లో భారీ ఎత్తున కరెన్సీ కట్టలు దొరకడం తెలిసిందే! ఆయన ఇంటికి కరెన్సీ కట్టలు తరలిపోవడం వెనుక తెలుగుదేశం పెద్దల సహకారం వుందనేదానిపై కూడా అనుమానాలున్నాయి. ఈ నాలుగేళ్ళలో ఇవే కాదు, ఇంకా అనేక లొసుగులున్నాయి. ఇటీవల కాగ్ రిపోర్ట్ కూడా ఏపి ప్రభుత్వ లెక్కలను కడిగిపెట్టింది. ఇక అవినీతిలోనూ ప్రతి ఏటా రాష్ట్రం అగ్రస్థానంలో నిలుస్తు వస్తోంది. వీటిలో దేనిమీద విచారణకు ఆదేశించినా చంద్రబాబుకు సమస్యలు మొదలవడం ఖాయం.

ప్రభుత్వంతో ఏ సంబంధం లేకపోయినా, అధికారికంగా ఏ పదవీ లేకున్నా జగన్ మీద అక్రమ ఆస్తుల కేసులు బనాయించి 16నెలలు జైలులో వుంచారు. ఈ నాలుగేళ్ళ తెలుగుదేశం ప్రభుత్వ పాలనపై ఎటువంటి విచారణకు ఆదేశించినా చంద్రబాబు ఎక్కడోచోట అధికారికంగానే దొరుకుతాడనే చర్చ జరుగుతోంది. కాబట్టే ఆయన భయపడుతున్నాడని సమాచారం.

కర్నాటకలో గెలిచినా ఓడినా బీజేపీ వాళ్ళు ఏపిలో తమ ఆపరేషన్‌ను ప్రారంభించడం ఖాయం. మొదటిది చంద్రబాబు అక్రమాలపై విచారణ జరిపించి వాటి నిగ్గు తేల్చి ప్రజల ముందు పెట్టడం, ప్రజల్లో చంద్రబాబును అవినీతి నాయకుడిగా చూపించడం.. ఇక రెండోది ఏపి ప్రజల్లో బీజేపీపై వున్న వ్యతిరేకతను తొలగించుకోవడం, దీనికి ప్రధానమార్గం రాష్ట్రానికి ప్రత్యేకహోదా ప్రకటించడం. కర్నాటక ఎన్నికల కోసమే ఇంతకాలం ఏపికి కేంద్రం ప్రత్యేకహోదాను ప్రకటించలేకపోయిందని తెలుస్తోంది. ఏపికి ప్రత్యేక హోదా ఇస్తే ఆ ప్రభావం కర్నాటక మీద పడుతుంది. కర్నాటకలో పెట్టాల్సిన పెట్టుబడులు ఏపికి తరలివచ్చే అవకాశం వుంది. కర్నాటకలో కాంగ్రెస్‌కు ఇది కలిసిరావచ్చు. బీజేపీకి అక్కడ అధికారంలోకి రావడానికి అవకాశాలున్నాయి. కాబట్టే కర్నాటక ఎన్నికల వరకు ఏపికి కఠినంగానే మొండిచేయి చూపిస్తూ వచ్చింది. కర్నాటక ఎన్నికల తర్వాత ఆ పార్టీ ఏపికి ప్రత్యేక హోదా ప్రకటించవచ్చు. 2019 ఎన్నికల్లో బీజేపీకి ఈ రాష్ట్రంలో సీట్లు, ఓట్లు రాకపోయినా తెలుగుదేశం అధికారంలోకి రాకూడదన్నది టార్గెట్. ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోతే ఆ స్థానంలోకి బీజేపీ రావచ్చు. భవిష్యత్‌లో బలపడవచ్చు. ఈ దిశగానే బీజేపీ ఏపి ఆపరేషన్ ఉండబోతున్నట్లు సమాచారం.

# ఆ ఒక్కడే వణికిస్తున్నాడు!

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబుకున్నంత రాజకీయ అనుభవం లేకున్నా, కుట్రలు, వ్యూహాలు పన్నే తెలివితేటలు లేకున్నా... కేవలం ఒకే మాటకు కట్టుబడి ఒకే మార్గాన్ని ఎంచుకుని ఈరోజు ప్రజాక్షేత్రంలో వై.యస్.జగన్ హీరో అయ్యాడు. 2019 ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడుతారు అన్నది పక్కనపెడదాం. ప్రస్తుతం ఏపిలో సెగలు రేపుతున్న అంశం ప్రత్యేకహోదా ఉద్యమం. ఈ సబ్జెక్ట్‌లో జగన్ ఏరోజూ మాట తప్పలేదు. నాలుగేళ్ళుగా ప్రత్యేకహోదా కోసం పోరాడుతున్నది జగనే! ఈ ఉద్యమాన్ని సజీవంగా నిలబెట్టింది జగనే! కేంద్ర ప్రభుత్వం ఏపికి ప్రత్యేకహోదా ఇచ్చేది లేదని ఒకటికి నాలుగుసార్లు చెప్పినా పట్టు విడవకుండా హోదా కోసం పోరాట బాట పట్టింది వైకాపానే! తన రాజకీయ చరిత్రలో చంద్రబాబు ఎప్పుడూ పట్టనంతగా గబ్బు పట్టింది ఈ ప్రత్యేకహోదా విషయంలోనే! గతంలో అవినీతి ఆరోపణలు, అక్రమాల సంఘటనలున్నా అవి బయటకు కనిపించేవి కావు. కాని హోదా విషయంలో ఆయన నిజస్వరూపం ప్రజల కళ్ళకు కట్టినట్లయ్యింది. కేంద్రం ప్రత్యేకహోదా లేదు, ప్యాకేజీ ఇస్తామన్నప్పుడు సంతోషంగా స్వాగతించింది ఆయనే! ప్రత్యేకప్యాకేజీ ఇచ్చినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు చెప్పిందీ ఆయనే! ప్రత్యేకహోదాపై ఉద్యమాలు చేసిన వాళ్ళ మీద కేసులు పెట్టించింది ఆయనే! నిండు సభలో ప్రత్యేకహోదా వస్తే ఏమొస్తాయయ్యా... హిమాచల్ ఏమయ్యింది... నార్త్ ఈస్ట్ రాష్ట్రాలలో ఏమొచ్చాయి, అక్కడ డెవలప్‌మెంట్ ఎక్కడుంది అని గద్దించింది ఆయనే! ఇన్ని అన్న ఆయనే ఈరోజు ప్రత్యేకహోదా కావాలంటున్నా, ప్రత్యేకహోదా కోసం సైకిల్‌యాత్రలు, బస్సు యాత్రలు, విమానం యాత్రలు చేయాలంటున్నా దానికి కారణం జగనే! ప్రత్యేకహోదా ఉద్యమం ఇప్పుడొక ఒలింపిక్ రేస్ మాదిరిగా మారింది. మొదటినుండి ఈ పోరాటం జెండా పట్టుకుని నడుస్తున్నది జగనే. తన లోక్‌సభసభ్యుల చేత రాజీనామాలు చేయించి దీక్షకు కూర్చో బెట్టాడు. ఏపి ప్రజలు జగన్ పోరాటాన్నే నమ్ముతున్నారు. చంద్రబాబు జగన్‌ను కాపీ కొడుతున్నాడనే ప్రచారం వచ్చేసింది. జగన్ అవిశ్వాస తీర్మానం పెడితే ఈయన కూడా అవిశ్వాస తీర్మానం అన్నాడు. జగన్ నిరాహారదీక్షలు పెడితే ఈయన సైకిల్‌యాత్రలు పెట్టాడు. వైసిపి ఎంపీలు అక్కడ రాజీనామా చేస్తే, తన ఎంపీల చేత ప్రధాని ఇంటి వద్ద డ్రామాలేయించాడు. ఇదంతా చూస్తుంటే ప్రత్యేకహోదా పోరాటంలో జగన్ పాత్ర ఒరిజినల్ గాను, చంద్రబాబు పాత్ర డూప్‌గాను కనిపిస్తోంది. జగన్ పిల్లకాకి... నా అనుభవం ముందు బచ్చా అని భ్రమపడ్డ చంద్రబాబుకి ఈరోజు ఆ ఒక్కడే... చుక్కలు చూపిస్తున్నాడు.

## నడిచినా... నిద్రించినా...

# ఏడాదంతా ప్రజల మధ్యే...



- 366రోజుల మహా ప్రస్థానం యాత్రకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సన్నద్ధం
- ఈ నెల 26 నుండే ప్రారంభం
- 1005 మంది మహిళల ఆశీస్సులతో ప్రజల ముందుకు

**ప్రజలే దేవుళ్ళు, వారి ఇళ్ళే తనకు గుళ్ళు అని భావించి అనుక్షణం వారి మధ్యే వుంటూ వారి సమస్యలు తెలుసుకుంటూ వారి కష్ట సుఖాలలో తోడుండాలని కోరుకునే ప్రజా నాయకుడు నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. నిద్ర లేచింది మొదలు ఆయనకు ప్రజల మధ్య ఉండడమే ఇష్టం. ప్రజల కష్టనష్టాలు తెలుసుకోవడమంటే ఇష్టం. వారి సమస్యలపై పోరాడడం అంటే ఇష్టం. ప్రజలకు దూరంగా ఉండాలంటే మాత్రం ఆయనకు చాలా కష్టం.**

2014 ఎన్నికలకు ముందే ఎమ్మెల్యేగా లేక ముందే నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో 141రోజుల పాటు ప్రజాబాట కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరినీ పలుకరించి, వారి సమస్యలు తెలుసుకున్నాడు. 2017 అక్టోబర్‌లో ఎమ్మెల్యేగా 'మన ఎమ్మెల్యే మన ఇంటికి' పేరుతో 105రోజుల పాదయాత్రకు శ్రీకారం చుట్టి రూరల్ నియోజకవర్గంలో గడపగడపకు వెళ్ళారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన 105 రోజుల పాదయాత్ర ఈ ఏడాది జనవరి 12వ తేదీన ముత్యాలపాలెం వద్ద ముగియడం తెలిసిందే! ఈ పాదయాత్ర ముగిసి గట్టిగా మూడు నెలలు కాలేదు. ఇప్పుడు ఏకంగా 366రోజుల మహా ప్రస్థానం యాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 26వ తేదీన ఉదయం 5.37 గంటలకు రామలింగాపురం సెంటర్ నుండి ప్రజా ప్రస్థానం పాదయాత్రను ప్రారంభించనున్నారు. 366రోజులంటే కరెక్ట్‌గా సంవత్సరానికి ఒక రోజు ఎక్కువే! ఏడాది పాటు ఇల్లు వాకిలి భార్యా బిడ్డలను, తన కుటుంబంలోకి కొత్తగా వచ్చిన మనవరాలిని కూడా వదిలేసి ప్రజల మధ్య తిరగనున్నారు. 366రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో 150రోజులు ప్రజల మధ్యనే పల్లెనిద్ర నిర్వహించనున్నారు. 303 సామూహిక సహపంక్తి భోజనాలు నిర్వహిస్తారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బి.సి, మైనార్టీ, మహిళ, యువత, విద్యార్థి, రైతులతో వాడవాడలా 1005 చోట్ల ఆత్మీయ సదస్సులు నిర్వహిస్తారు. నియోజకవర్గంలోని ప్రతి స్కూలు, ప్రతి కాలేజీకి వెళతారు. విద్యార్థులతో ముచ్చటిస్తారు. గుడి, మసీదు, చర్చిలకు వెళ్ళి ప్రార్థనలు నిర్వహిస్తారు. మత పెద్దల ఆశీస్సులు తీసుకుని వారి సూచనలు సలహాలు స్వీకరిస్తారు. పాదయాత్ర మధ్యలో ఇంట్లో శుభ కార్యాలకు, పార్టీ కార్యక్రమాలకు హాజరవుతుంటారు. ఈమధ్యలో ఎన్నికలొచ్చినా ప్రజాప్రస్థానం పాదయాత్ర నుండే వెళ్ళి నామినేషన్ వేస్తారు. ఈ ప్రజాప్రస్థానం పాదయాత్ర విజయవంతం కావాలని కోరుకుంటూ ఆయన 12వతేదీ మూలాపేట అరుంధతీయవాడకు వెళ్ళి 1005 మంది మహిళల ఆశీర్వాదం తీసుకున్నారు. యాత్ర ప్రారంభానికి ముందు ఈ 14రోజుల పాటు కూడా ఆయన రూరల్‌లో వివిధ ప్రాంతాల ప్రజలను కలిసి ఆశీస్సులు తీసుకోనున్నారు.









Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com